
రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:25 (ఆదివారం సాయంత్రం) సహర్: 4:55 (సోమవారం ఉదయం)

ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కొలువుదీరి వుంది. 550 పడకల సామర్థ్యంతో ఈ ఆస్పత్రిని తీర్చిదిద్దారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులకే కాదు, పక్క రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఏపీతో పాటు నల్గొండ, సూర్యాపేట, కృష్ణా, మహబూబాబాద్, ములుగు జిల్లాల ప్రజలకు కూడా ఈ ఆస్పత్రి వైద్యసేవలు అందిస్తోంది. నిత్యం వేలాది మందికి ప్రాణాలు పోస్తూ.. ఎంతో మంది ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తున్న ఈ ఆస్పత్రిని అనేక సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. అరకొర వసతులు, అంతర్గత రాజకీయాలు, వర్గపోరు ఈ ఆస్పత్రికి నయంకాని సుస్తిని కలిగిస్తున్నాయి. దీంతో నిరుపేదలకు సరైన వైద్యం అందించలేక కునారిల్లుతోంది. కాలంతో పాటు ఆధునిక వైద్యం వైపు అడుగులు వేయలేకపోతోంది. స్పెషలిస్టు వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది కొరతతో పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతోంది. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా ఆస్పత్రి అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగడం లేదనే విమర్శలున్నాయి. చుట్టుముట్టిన సమస్యలతోపాటు తాను పడుతున్న అవస్థలపై ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి తన ఆత్మఘోషను ఇలా వినిపిస్తోంది..

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్



నా నాడి పట్టేదెవరు?

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆత్మఘోష

నేను ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిని మాట్లాడుతున్నా. ఉత్తర తెలంగాణకు పెద్దదిక్కుగా 550 పడకల సామర్థ్యంతో ఖమ్మం నడిబొడ్డున జిల్లా ఆస్పత్రిగా నన్ను తీర్చిదిద్దారు. పక్క రాష్ట్రాలైన చత్తీస్‌గడ్, ఏపీతో పాటు ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, కృష్ణా, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల నుంచి వచ్చే ప్రజలను నేను అక్కున చేర్చుకుంటున్నా. అయినా నాలో ఏదో వెలితి అసంతృప్తి. సరైన వైద్యాన్ని అందించలేక పోతున్నాననే బాధ నన్ను వేధిస్తోంది. అన్ని వైద్య విభాగాల్లో కలిసి 115 మంది వరకు శాశ్వత వైద్యులు ఉండాలి. ఉన్నది మాత్రం 80మంది మాత్రమే. ఇక వీరిలో ఎస్సార్లు 59మందికి గాను 28మంది ఉన్నారు. స్టాఫ్ నర్సులను మాత్రం సర్కారు గతేడాది నింపడంతో 203 మంది వచ్చారు. వీవీపీ పరిధిలో పనిచేస్తున్న వారు మరో 25మంది ఉన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు 25 మందికి ఐదుగురు మాత్రమే రెగ్యులర్ వాళ్లున్నారు.

మిగిలిన వారంతా పొరుగు సేవల వాళ్లే. రేడియాలజిస్టులు ఒక్కరంటే ఒక్కరూ లేరు. ఈ విభాగం అంతా ఖాళీగానే ఉంది. గైనిక్ విభాగంలో 12 మందికిగాను నలుగురు సెలవులో ఉంటున్నారు. జనరల్ మెడిసిన్‌లో 18 మందికి ఒక అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టు ఖాళీగా ఉంది. జనరల్ సర్జరీ విభాగంలోనూ 12 మందికి ఒక అసోసియేట్ ప్రొఫెసర్ ఖాళీగా ఉంది. అనాటమీలో ఆరుగురు ఉండాల్సి ఉండగా ముగ్గురు, ఫిజియాలజీలో ఆరుగురికి ముగ్గురు, బయోకెమిస్ట్రీలో ఆరుగురికి ముగ్గురు, ఫార్మాలో ఆరుగురికి ముగ్గురు, మైక్రోబయాలజీలో ఆరుగురికి నలుగురు, సోషల్ ప్రివెంట్ మెడిసిన్‌లో ఆరుగురికి ఇద్దరు, పీడియాట్రీషిన్‌లో ఆరుగురికి నలుగురు, ఐసీయూలో ఐదుగురికి నలుగురు, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు ఆరుగురికి ఇద్దరు, సీఎస్ ఆర్ఎంవోలో ఒక పోస్టు, సీఏఎస్ ఆర్ఎంవోలో ఆరుగురు ఉండాల్సి ఉండగా ఒక్కరూ లేరు.

గతంలో ఇక్కడ యూరాలజీ, ఈఎన్టీ, కార్డియాలజీ, రేడియోథెరఫీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ, ఎండో క్రైనాలజీ, న్యూరాలజీ విభాగాలలో విస్తృతంగా వైద్యసేవలు అందించినా ఇప్పుడు నన్ను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇవన్నీ భర్తీ చేస్తేనే ఇక్కడ మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. నా వద్దకు వచ్చే పేదల ప్రాణాలు నిలబడతాయి. నా విభాగాల్లో నిపుణులైన వైద్యులు ఉన్నాపరీక్షల సమయాల్లో అందుబాటులో లేకపోవడంతో .ఎస్ఆర్(సీనియర్ రెసిడెన్స్) లతో విధులు నిర్వహింప చేయాల్సి వస్తోంది. పాపం ప్రాణాపాయస్థితిలో వచ్చిన వారికి అత్యవసర వైద్యం కోసం వచ్చిన వారిని హైదరాబాద్‌కు పంపించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

చివరిగా ఒక మాట...

నాపై నమ్మకంతో వచ్చే రోగుల అవస్థలు చూడలేక నా బాధను మీ ముందు ఉంచుతున్నా.. ఈ సమస్యలకు పరిష్కారాన్ని చూపించి సౌకర్యాలు కల్పిస్తే ప్రజలకు ఆరోగ్య ప్రదాతగా నిరంతర సేవలు అందిస్తా.. జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులూ... మీరైనా ఓ మారు నాపై కన్నేసి పరిశీలిస్తారని ఎదురుచూస్తుంటాను.

- మెడికల్ కాలేజీకి అనుసంధానంగా ఉన్న జిల్లా జనరల్ ఆస్పత్రిలో స్వయంప్రతిపత్తితో నిర్వహిస్తున్నా.. పర్యవేక్షణ అధికారులు నిర్ణయాలు తీసుకోవడంలో వైఫల్యం చెందుతున్నారు.
- జిల్లా ఆస్పత్రిలో మోకీలు ఆపరేషన్లు నిర్వహించడం లేదు. ఇతరత్రా సర్జరీలకు ఆరోగ్యశ్రీ ద్వారా నిర్వహిస్తున్నా ఆ బిల్లులను సరైన మార్గంలో వినియోగించకుండా ఆస్పత్రి అవసరాలకు వినియోగించడం వలన బకాయిలు పెరిగిపోతున్నాయి.
- ఉస్మానియా తర్వాత అంతటి స్థాయిలో రూ. 7 కోట్లతో ఏర్పాటు చేసిన క్యాథ్‌లాబ్‌లోనూ అరకొరగా ఆపరేషన్లు జరుగుతున్నాయి. ఇక్కడి సర్జరీలకు, స్టంట్లు ఇంజక్షన్లు ప్రైవేటుగానే కొనుగోలు చేస్తున్నారు. దీంతో వాటికి సంబంధించిన బిల్లులు సకాలంలో అందక పోవడంతో సరఫరాదారులు తిరిగి పరికరాలను పంపిణీ చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో రోగులు రోజుల తరబడి వార్డుల్లో ఉండాల్సి వస్తోంది.
- ఆరోగ్యశ్రీలో రోగులకు అవసరమైన ఎంఆర్‌ఐతో పాటు ఇతర పరీక్షలు చేయించాలంటే ప్రైవేటు ల్యాబ్‌లకు రిఫర్ చేసేవారు. ఇప్పుడు ఎంఆర్‌ఐ నిరుపేదలకు అందే అవకాశం లేకుండా పోయింది.
- ఆస్పత్రి వాతావరణం మెత్తం ఇబ్బందికరంగా మారింది. అంతర్గత రోడ్లు లేకపోవడంతో దుమ్ముదుమారం రేగుతోంది. పాత ఆస్పత్రిలో అన్నిలీకుల మయం అవుతున్నాయి. పార్కింగ్ ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. ఆస్పత్రిలో ఆహ్లాదం మాత్రం కరువైంది. వేసవి వస్తోంది. ఐసీయూ విభాగాల్లో జనరల్ వార్డుల్లో ఫ్యాన్లు, ఏసీలు పనిచేయక రోగులు అల్లాడిపోతుంటారు. ఇవన్నీ భరించ లేక పేదలు ప్రైవేటుకు వెళ్లిపోతుంటే గుండెలు తరుక్కుపోతోంది.

నగర మణిహారంగా కేబుల్ బ్రిడ్జి

- నిర్మాణ పనులకు రూ.141 కోట్లు వెచ్చిస్తున్నాం
- ఖమ్మంను ట్రాఫిక్ ఫ్రీగా తీర్చిదిద్దుతాం: మంత్రి తుమ్మల



ఖమ్మం కాల్వొడ్డులో తీగల బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ట్రాఫిక్ ఫ్రీ నగరంగా ఖమ్మం పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం కాల్వొడ్డులోని మున్నేరుపై రూ.180కోట్లతో నిర్మిస్తున్న తీగల వంతెన నిర్మాణ పనులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి శనివారం పరిశీలించారు. కేబుల్‌బ్రిడ్జి నిర్మాణ పురోగతి వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెండువైపులా సమాంతరంగా పనులు చేపట్టాలని, జూన్‌లోపు ఎరక్షన్ పనులు పూర్తిచేయాలని, అధికారులకు సూచించారు. అనంతరం మంత్రి తుమ్మల విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఖమ్మం పట్టణానికి మణిహారంగా ఉండేలా ఈ తీగల వంతెనను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుందని, మొత్తం రూ.180కోట్లు నిధులు మంజూరు చేయగా బ్రిడ్జి నిర్మాణపనులకు రూ.141 కోట్లు, భూసేకరణ పరిహారానికి రూ.39 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు.24నెలల వ్యవధిలో పనులు పూర్తిచేయాల్సి ఉన్నప్పటికి ప్రారంభంలో కొంతఆలస్యం జరిగిందని, ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వర్షాకాలం కంటే ముందే తూర్పుభాగం పనులు పూర్తవుతాయని, ఆ తర్వాత పడమర వైపు పనులు చేపట్టి తీగల వంతెనను ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కేబుల్‌బ్రిడ్జి కోసం అవసరమైన భూసేకరణ, చిన్న వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా తగిన సాయం అందిస్తామని, ఇందుకు కలెక్టర్ అధ్యక్షతన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణంలో జీవనోపాధి కోల్పోకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ఎవరు నష్టపోవడానికి వీలులేదన్నారు. కేబుల్ బ్రిడ్జికి సంబంధించి అప్రోచ్ రోడ్డును ఆరులైన్ల రోడ్డుగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజల కోరికమేరకు ఖమ్మం నగరంలోరోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నామని, విశాలమైన రోడ్లను నిర్మించనున్నామని తెలిపారు. ఆగస్టు 15నాటికి ఖమ్మం మీదుగా రాజమండ్రి గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తవుతుందని, పొన్నెకల్ నుంచి ఇల్లెందు క్రాస్‌రోడ్డు జాతీయ రహదారికి అమరావతి రోడ్డుకు అనుసంధానం చేస్తూ రూ.120కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఖమ్మం పట్టణం ట్రాఫిక్ ఫ్రీ చేసే దిశగా రాజమండ్రి-అమరావతి జాతీయ రహదారి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఈఈ యుగంధర్, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను వెల్లడిస్తున్న మల్టీజోన్ ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి

లొంగిపోయే వారికి తక్షణమే ప్రతిఫలాలు

- మల్టీజోన్ ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి
- 64 మంది మావోయిస్టుల లొంగుబాటు
- అందరూ ఛత్తీస్‌గఢ్ వాసులే...
- వెనువెంటనే రివార్డుల అందజేత

4



నేలకొండపల్లిలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, హాజరైన స్వేరోలు

'భీమ్ దీక్ష'ను జీవితాంతం కొనసాగించాలి..

- వారంలో 3 రోజులు పుస్తకాల పఠనానికి కేటాయించాలి
- వారంలో 16 గంటలు ఉపవాసం పాటించాలి : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఇఫ్తార్ విందులో మంత్రి తుమ్మల

4

- పాల్గొన్న కలెక్టర్, సీపీ

అనుమానం పెనుభూతమై...

- భార్య, మరో వ్యక్తిపై కత్తితో దాడి
- ధంసలాపురంలో ఘటన..
- గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మం క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తన భార్య మరో వ్యక్తితో సంబంధం పెట్టుకుందని అతడు అనుమానం పెంచుకున్నాడు. ఆ కోపంతో భార్యపైన, సదరు వ్యక్తిపైనా కత్తితో దాడి చేశాడు. ఈ దారుణ సంఘటన శనివారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నగర శివారులోని ధంసలాపురం కాలనీకి చెందిన నూకారపు ఏడుకొండలు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అతని భార్య అదే ప్రాంతానికి చెందిన గుంజలూరి చిన్న వెంకటేశ్వర్లుతో వివాహేతర సంబంధం పెట్టుకున్నదని కొంతకాలంగా అనుమాన పడుతున్నాడు. ఈ క్రమంలో ముందస్తు ప్లాన్ ప్రకారం శనివారం సాయంత్రం ధంసలాపురం బ్రిడ్జి వద్ద కాపు కాసుకుని కుర్చున్నాడు. రాత్రి 8గంటల సమయంలో వెంకటేశ్వర్లు ద్విచక్రవాహనంపై గడ్డిమోపు కట్టుకుని ఇంటికి వస్తుండగా... ఏడుకొండలు ఒక్కసారిగా అడ్డుకొని వెంకటేశ్వర్లుపై కత్తితో దాడి చేశాడు. మెడ భాగంలో రెండుసార్లు, తల భాగంలో ఒకసారి కత్తితో పొడవడంతో వెంకటేశ్వర్లుకు తీవ్ర రక్తస్రావం జరిగింది. సమీపంలో ఉన్న వ్యక్తులు అడ్డుకోవడంతో అక్కడి నుంచి ఏడుకొండలు పారిపోయాడు.

అనంతరం ఇంటికెళ్లి అదే కత్తితో భార్యపై దాడి చేసి గాయపరిచాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఖానాపురం హవేలి పోలీసులు సంఘటన స్థలం వద్దకు వచ్చి వివరాలు సేకరించారు. స్థానికులు గాయపడిన వారిని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వెంకటేశ్వర్లు పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. నిందితుడు ఏడుకొండలు పరారీలో ఉన్నట్టు సమాచారం. ఈ ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని, జరిగిన ఘటన వాస్తవమేనని పోలీసులు తెలిపారు.

అదిగదిగో 'పదునెట్టాంబడి'..

- అయ్యప్ప భక్తుల కోసం నగరంలో మరో ఆలయం
- నేడు విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్న కేరళ నంబూద్రి
- రూ.4 కోట్లతో సిద్ధమైన కోవెల

4

కిష్టారం పోరుకు బ్రేక్

- సింగరేణి సైలోబంకర్‌కు వ్యతిరేకంగా 34 రోజుల రిలే దీక్షలు
- మట్టా దయానంద్ హామీతో తాత్కాలికంగా విరమణ

యానిమేటర్లు, సీసీల చేతివాటం

- పేరుకుపోయిన మొండి బకాయిలు
- అందని స్త్రీ నిధి రుణాలు
- ఇబ్బందుల్లో మహిళా సంఘాలు


స్త్రీ నిధి రుణాల మంజూరు సమావేశంలో మహిళలు

కొత్తగూడెం అర్బన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలనలో డ్వాక్రా మహిళా సంఘాల నిర్వహణలో రాజకీయ జోక్యం పెరిగింది. కొంత మంది సిబ్బంది చేతివాటం, అధికారుల పర్యవేక్షణ లేమి వెరసి లావాదేవీలు అన్నీ అస్తవ్యస్తంగా మారి గ్రామీణ మహిళల జీవితాల్లో చిమ్మచీకట్లు అలుముకున్నాయి. స్త్రీ నిధి రుణ బకాయిలు పేరుకుపోయి మొండి బకాయిలుగా గుర్తించడంతో ఆయా మండలాల్లో సంఘాలకు రుణాలు మంజూరు నిలిచిపోయింది. మహిళా సంఘాల లావాదేవీలను నిర్వహిస్తూ పర్యవేక్షించేందుకు నియమించిన కొంద రు అధికారులు, సిబ్బందికి రాజకీయ అండదండలు పుష్కలంగా ఉండటంతో అక్రమాలకు తెరతీశారు. సంఘాలపై పెత్తనం చెలాయించడం తోపాటు అక్రమాలకు పాల్పడటం సంఘాల ప్రగతికి అవరోధంగా మారింది. ప్రస్తుతం సంఘాల్లోని మహిళలు స్వయం ఉపాధి అందక బయటినుంచి అధిక వడ్డీలకు అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నారు. అక్రమాలపై విచారణ చేసిన అధికారులు కొందరు అక్రమార్కులపై తీసుకుంటున్న చర్యలు కంటితుడుపుగా మిగులుతున్నాయి. మొండి బకాయిల వసూలులో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మహిళలకు రుణాలు సకాలంలో అందించడం లేదన్న విమర్శలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.

లావాదేవీల్లో లోపించిన స్పష్టత..

ఎస్‌హెచ్‌జీ సంఘాల ఆర్థిక లావాదేవీలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేసేందుకు యానిమేటర్లను (వీవోఏ) నియమించారు. అయితే ఆర్థిక లావాదేవీలపై సభ్యుల అవగాహన లోపం, ఉదారత కారణంగా బుక్కుల్లో లెక్కలు రాయాల్సిన వీవోఏలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సంఘాల లావాదేవీల్లో పెత్తనం చెలాయిస్తున్నారు. సంఘాల ఆర్థిక లావాదేవీలను నిర్వహిస్తూ బ్యాంకుల్లో రుణాల అందజేతలో క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన కొందరు సీసీలు యానిమేటర్లతో కుమ్మక్కై మహిళలు చెల్లించిన మొత్తాలను బ్యాంకుల్లో జమచేయకుండా స్వాహా చేస్తున్నారు. ఆఫ్‌లైన్ రికార్డుకు ఆన్‌లైన్ రికార్డుకు వ్యత్యాసాల కారణంగా సంఘాల లావాదేవీల్లో స్పష్టత లోపించింది. దీంతో లావాదేవీలు గందరగోళంగా మారుతున్నాయి.

జిల్లాలో రూ.35 కోట్లు..

జిల్లాలో 22 మండలాల్లో 1105 వీవోల్లోని 10,540 స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీ) స్త్రీనిధి రుణాలు తీసుకున్నారు. వీరందరికి స్త్రీ నిధి ద్వారా రూ.371కోట్లు రుణాలు ఇచ్చారు. ఇందులో రూ.35కోట్లు మొండి బకాయిలుగా నిలిచిపోయాయి. వీటిల్లో 30గ్రామ సంఘాలు నిధుల దుర్వినియోగానికి గురైనట్టు మహిళలు స్త్రీ నిధి అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ విషయమై స్త్రీ నిధి ఆర్‌ఎం శ్రీనివాస్‌ను వివరణ కోరగా... యానిమేటర్లు, సీసీలపై విచారణ చేసి నివేదికలు ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నట్టు తెలిపారు.

చర్యలు తీసుకుంటాం

విద్యాచందన, అదనపు కలెక్టర్

జిల్లాలో 10వేల సంఘాల నుంచి రూ.35కోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉంది. మొండి బకాయిల కారణంగా జిల్లాలో ఎన్‌పీఏ శాతం పెరిగింది. సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదులపై విచారణలు చేపడుతున్నాం. అక్రమాలకు పాల్పడినట్టు తేలితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. అలాగే నిధుల స్వాహాకు పాల్పడిన వారిపై రికవరీ చేయడంతోపాటు పోలీసులకు ఫిర్యాదులు చేసి కేసులు నమోదు చేస్తాం. వీలైనంత త్వరగా రికవరీగా సంఘాలకు రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నాం.


లోక్యాతండాలో కామదహన వేడుకలు


దూండ్ వేడుకలు నిర్వహిస్తున్న గిరిజనపెద్దలు

లోక్యాతండాలో రెండోరోజూ హోలీ వేడుకలు

- తెల్లవారుజామున కాముని దహనం
- సంప్రదాయబద్ధంగా దూండ్ వేడుకలు

కూసుమంచి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోక్యాతండాలో రెండోరోజు శనివారం హోలీ వేడుకలు సాంప్రదాయబద్ధంగా కొనసాగాయి. తెల్లవారుజామున 4 గంటలకు తండాలో కామదహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్రక్రమంలో తండావాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి ఇంటి నుంచి కర్రలను తీసుకుని వచ్చి శివారుల్లో పేర్చి కామదహనం నిర్వహించారు. తండాలో గేరియాగా పిలవబడుతున్న సామ ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. యువకులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇలా అందరూ మంటలచుట్టూ తిరిగి పాటలతో కేరింతలు కొట్టారు. అనంతరం బూడిదను నుదిట దిద్దుకున్నారు. కార్యక్రమంలో తండాపెద్దలు మాజీఎంపీటీసీ సభ్యులు జర్పుల బాలాజీనాయక్, మాజీ జడ్పీటీసీ సభ్యులు రామచంద్రునాయక్, వడిత్య సేట్‌రాం, గ్రామపెద్దలు గేరియా సామ పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో తండాకు చెందిన వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఉద్యోగులు పాల్గొన్నారు.

లోక్యాతండాలో హోలీని పురస్కరించుకుని దూండ్ కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. గత హోళీ తెల్లారి నుండి ఈహోళీవరకు ఏడాదికలంలో తండాలో మగబిడ్డపుట్టిన ఇళ్లలో ఈతంతును జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈసందర్భంగా తమ బంధువులను ఆహ్వానించి వేడుకగా జరుపుకున్నారు. మగబిడ్డ పుట్టిన ఇళ్లలో ఈకార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. గేడియాలుగా వ్యవహరిస్తున్న వడిత్య సామ నాయక్ క్యార్యక్రమాన్ని ప్రాంబించారు. తలకు ఎర్రని గుడ్డను కట్టుకుని సాంప్రదాయంగా జరిగించారు. దూండ్ వేడుకలు నిర్వహించే బిడ్డలకు కూడ ఎర్రని గుడ్డకట్టారు. అనంతరం గిరిజన సాంప్రదాయ పాటలు పాడి నృత్యం చేశారు. అనంతరం బిడ్డలకు నామకరణం చేశారు. గేరియాలు పెద్ద కర్రను పట్టుకోగా మిగిలిన వారు ఆకర్రను కొడుతు దూండ్ కార్యక్రమాన్ని సాంప్రదాయంగా నిర్వహించారు. అనంతరం తల్లీ బిడ్డలను దీవించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

మా వల్ల కాదు..!

- శ్రీరామనవమి నాటికి షెడ్ల నిర్మాణం పూర్తి చేయలేం
- అధికారులకు నివేదించిన కాంట్రాక్టర్లు



భద్రాచలం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం పరిధిలోని మిథిలా స్టేడియం ప్రాంగణంలో చేపట్టిన షెడ్ల నిర్మాణం నవమి నాటికి పూర్తి చేయలేమని సంబంధిత కాంట్రాక్టరు అధికారులు, కలెక్టరుకు నివేదించినట్లు సమాచారం. రూ.1.60కోట్లతో ప్రసాద్ పథకంలో భాగంగా ఈ పనులను చేపడుతుండగా గత ఏడాది అక్టోబరులో ఈ పనులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 6న శ్రీరామనవమి నాడు సీతారాముల కల్యాణం ఇదే స్టేడియం ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఇటీవల కలెక్టర్ జితేష్ వి పాటిల్ నవమికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై నిర్వహించిన ముందస్తు సమావేశంలో సైతం పనులను వేగంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అయితే షెడ్ల నిర్మాణానికి సంబంధించిన పనులు పునాది స్థాయి వరకు చేసి అనంతరం తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందుకు సంబంధించిన శ్రీరామనవమి అనంతరం మళ్లీ చేపట్టనున్నట్లు పేర్కొంటున్నారు. కాగా ఇటీవల మహబూబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ సైతం ఈ పనుల పనితీరును పరిశీలించి నవమి నాటికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇంకా మూడు వారాలు మాత్రమే గడువు ఉండటంతో పాటు సెక్టార్ల పనులు చేపట్టాల్సి ఉంది. ఈ సమ్యాయంలో పనులు పూర్తి చేయడం సాధ్యం కాదనే భావనతోనే అధికారులు ముందుగానే జిల్లా కలెక్టరుకు నివేదించినట్లు వినికిడి.


ఇఫ్తార్ విందులో మంత్రి తుమ్మల, కలెక్టర్, సీపీ

ఇఫ్తార్ విందులో మంత్రి తుమ్మల

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని కాల్వొడ్డు దారుల్ ఉలూమ్ మదర్సాలో శనివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు ఆచరించారు. ప్రజలందరిని అల్లా చల్లగా చూడాలని, ఈ మాసంలో ముస్లిం సోదరులకు అన్ని విధాలా ప్రభుత్వం సహకరిస్తుందని, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో పని చేస్తున్న వారికి ప్రత్యేకంగా సమయం కేటాయించామని, సాయంత్రం గంట ముందుగానే వెళ్లేవిధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మంత్రి అన్నారు. పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని, పేద ముస్లింలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

జమలాపురం ఆలయంలో భక్తుల రద్దీ

ఎర్రుపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి గాంచిన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం భక్తులు పెద్దఎత్తున సందర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించారు. అనంతరం ముత్యాల కవచ అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. ఈ కార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్, అర్చకులు రాజీవ్‌శర్మ, సుదర్శన్‌శాస్త్రి పాల్గొన్నారు.

పాత దుస్తులపై ఆదివాసీల మక్కువ

- ప్రతీవారం చర్ల సంతలో అమ్మకాల జోరు
- ధరలు తక్కువే కారణం



చర్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాల గ్రామాలు తెలంగాణ రాష్ట్రం చర్ల మండలానికి దగ్గరగా ఉంటాయి. ఈ గ్రామాలకు కనీసం రహదారి సౌకర్యం కూడా లేని పరిస్థితి. ఈ గ్రామాలు ఇప్పుడిప్పుడే బాహ్యప్రపంచానికి దగ్గర అవుతున్నాయి. అక్కడి నిరుపేదలు ప్రతీ ఆదివారం చర్లలో జరిగే వారపు సంతకు వచ్చి పాత దుస్తులను కొనుగోలు చేస్తుంటారు. చిరువ్యాపారులు కేవలం వీరి కోసమే పాత దుస్తుల దుకాణాలు పెట్టడం విశేషం. పెద్దలు, పిల్లలు, వృద్ధులు సంతలో వారికి కావాల్సిన ప్యాంట్, షర్ట్, చీరలు, మిడ్డీలు, పంచెలు కొనుగోలు చేస్తారు. ఒక్కో ప్యాంట్ రూ.150, షర్టు రూ.100 చీర రూ.100 మాత్రమే అని అమ్మకందారులు చెబుతున్నారు. ఈ దుస్తులు చాలా బాగుంటాయని ఆదివాసీలు చెబుతున్నారు. ఈ దుస్తుల కొనుగోలు కోసమే పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలిసి వందల కిలోమీటర్లు నడిచి సంతకు వస్తారని చెబుతున్నారు. చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం మండలంలోని ఆదివాసీలు కూడా ఈ దుస్తులను కొనుగోలు చేస్తారని అమ్మకందారులు చెబుతున్నారు. బీజాపూర్, సుకుమా జిల్లాల నుంచి చాలా మంది ఆదివాసీలు చర్ల మండలంలోని మిర్చి తోటల్లో పనులు చేస్తున్నారు. వచ్చిన డబ్బుల్లో కొంత నగదు దుస్తులకు కేటాయిస్తున్నారు.

ఆంగ్లంపై విద్యార్థులు భయంవీడాలి...

- 'వుయ్ కెన్ లెర్న్ ఇంగ్లిష్' సత్ఫలితాలను ఇస్తోంది...
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కొణిజర్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ఆంగ్లంపై విద్యార్థులు భయంవీడి లక్ష్యంతో ముందుకు వెళ్లాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. మండలంలోని పెద్దమునగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో 'వుయ్ కెన్ లెర్న్ ఇంగ్లిషు' పై కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆంగ్లంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు నేర్పించిన విధానాన్ని స్వయంగా విద్యార్థులతో మాట్లాడించి తెలుసుకున్నారు. మూడు నెలల్లోనే విద్యార్థుల్లో ఉపాధ్యాయులు మార్పును తీసుకొచ్చారని, ఎంతో గర్వంగా ఉందన్నారు. ఖమ్మంజిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుంతా ఆత్మవిశ్వాసంతో అనర్గళంగా ఆంగ్లం మాట్లాడే విధంగా తయారు చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ, మండల విద్యాశాఖాధికారి అబ్రహం, అకడమిక్ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, తహసీల్దార్ రాము, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అదిగదిగో 'పదునెట్టాంబడి'..

- అయ్యప్ప భక్తుల కోసం నగరంలో మరో ఆలయం
- నేడు కేరళ నంబూద్రి చేతుల మీదుగా విగ్రహ పతిష్ఠాపన
- రూ.4కోట్ల విరాళాలతో సర్వాంగ సుందరంగా కోవెల


నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయం

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర ఆధ్యాత్మిక వైభవానికి మరో చేర్పు తోడైంది. శబరిమల ఆలయాన్ని పోలిన విధంగా నగరంలో అద్భుతమైన ఆలయాన్ని భక్తులు నిర్మించారు. నగరంలోని చైతన్యనగర్ బైపాస్ రోడ్‌లో నిర్మితమైన శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయం ప్రారంభానికి సిద్ధమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే పదునెట్టాంబడి కలిగిన మొట్టమెదటి ఆలయంగా విశిష్టతను చాటుతోంది. నగరంలో శ్రీనివాసనగర్‌లో ఇప్పటికే ఉన్న అయ్యప్ప ఆలయం మాలలు ధరించే సీజన్‌లో భక్తుల కిటకిటలాడుతుంటుంది. అక్టోబరు నెల మొదటి వారం నుంచి జనవరి 15 సంక్రాంతి వరకు 150 రోజుల పాటు ఈ ఆలయం ఎంతో రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలో అయ్యప్ప భక్తులు మరో ఆలయాన్ని నిర్మించేందుకు పూనుకున్నారు. ఆలయ నిర్మాణానికి స్థలం దొరకక ఇబ్బందులు పడుతున్న సమయంలో 10వ డివిజన్ కార్పొరేటర్ చావా మాధురి నారాయణరావు బైపాస్ రోడ్డు పక్కనే ఖాళీగా ఉన్న గ్రీన్‌ల్యాండ్ స్థలాన్ని చూపించారు. శ్రీ ధర్మశాస్త్ర అన్నదాన సమితి ఆధ్వర్యంలో 44 మంది సభ్యుల సహకారంతో 2023 డిసెంబరు 18న రోటరీనగర్‌లో 650 గజాల స్థలంలో అయ్యప్ప ఆలయానికి శంకుస్థాపన చేశారు. రూ.4కోట్ల అంచనా వ్యయంతో కేవలం 15 నెలల్లో ఆలయం నిర్మాణం పూర్తి చేయించి ఔరా.. అనిపించకున్నారు. ఆలయంలో ప్రతిష్ఠించే స్వామి విగ్రహాన్ని పంచలోహాలతో పోతపోశారు. విగ్రహాలను చెన్నై నుంచి తీసుకొచ్చారు. శ్రీ ధర్మశాస్తా అన్నదాన సమితి చైర్మన్ మేకల హనుమంతరావు ఈ మహాయజ్ఞానికి సారథిగా వ్యవహరించారు. నగరంలోని భిన్నవర్గాల ప్రముఖులు ఈ ఆలయ నిర్మాణానికి విరాళాలు ఇచ్చి సహకరించారు. ఈ ఆలయంలో వినాయక, నాగేంద్ర స్వామి, సుబ్రమణ్య స్వామి ఉప ఆలయాలను నిర్మించారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఆదివారం అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. 17వ తేదీన పదునెట్టాంబడి, ధ్వజ స్తంభ ప్రాణ ప్రతిష్ఠలు జరగనున్నాయి. ఆదివారం ఉదయం 10:26 నిమిషాల నుంచి 11:30 నిమిషాల మధ్య కేరళకు చెందిన తంత్రి తక్కే కోర మంగళం దామోదరన్ నంబూద్రి, పాకతిల్లం నారాయణన్ నంబూద్రి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నారు. 18వ తేదీ ఉదయం 10:35 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1:45 మధ్య కడుత్త స్వామి, కరుప్ప స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగనున్నది. ఈ ఆలయానికి పక్కనే ఆంజనేయస్వామి నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేశారు.

'భీమ్ దీక్ష'ను జీవితాంతం కొనసాగించాలి..

- వారంలో 3 రోజులు పుస్తకాల పఠనానికి కేటాయించాలి
- స్వేరోస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

నేలకొండపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కాన్షీరాం జయంతి నుంచి అంబేద్కర్ జయంతి వరకు స్వేరోల మాసంలో పాటించే భీమ్ దీక్షలో అందరి ఇంట్లో పుస్తకాల గదిని ఏర్పాటు చేసుకోవాలని స్వేరోస్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రం వద్ద శనివారం ఏర్పాటు చేసిన భీమ్ దీక్షను ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమ్ దీక్ష నెల రోజులు మాత్రమే గాకుండా జీవితాంతం కొనసాగించాలన్నారు. స్వేరోలంతా భయాన్ని వీడాలని, సమాజంలో పేద వర్గాలపై జరుగుతున్న అణచివేతను జ్ఞానంతోనే ఎదిరించాలన్నారు.

స్వేరోలు ఏ రంగంలో ఉన్నా.. ఆ రంగంలో కష్టపడి రాణించాలన్నారు. భీమ్ దీక్షలో భాగంగా కుటుంబమంతా వారంలో 3 రోజులు పుస్తకాలు చదువుతూ ఫోన్లకు పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. చారిత్రక, సుందరమైన ప్రదేశాలను సందర్శిస్తూ, సంపద ఉన్న చోటకు పిల్లలను తీసుకెళ్లటం వల్ల భవిష్యత్తులో పిల్లలు ఉన్నతమైన వ్యక్తులుగా తయారవుతారన్నారు. అధికారం, ఆత్మ గౌరవంతో బతకాలంటే ఆర్థికంగా ఎదగాలన్నారు. స్వేరోలు వ్యాపార రంగంలో ఎదగాలన్నారు. సంపాదించే సొమ్ములో కొంత భాగం భీమ్ విద్యానిధి కింద పేదల కోసం వినియోగించాలన్నారు. వారంలో 16 గంటలు ఉపవాసం ఉంటే ఆరోగ్యానికి మంచిదని, భీమ్ దీక్షలో దీన్ని పాటించాలన్నారు. రానున్న రోజుల్లో స్వేరోయిజాన్ని అన్ని దేశాలకు విస్తరించేలా ప్రణాళికలు చేస్తున్నామని ప్రవీణ్‌కుమార్ అన్నారు. వీరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రవీణ్, ఊషన్న, దుర్గయ్య, లలిత, శోభ తదితరులతో పాటు పెద్దసంఖ్యలో స్వేరోలు పాల్గొన్నారు.

కిష్టారం పోరుకు బ్రేక్

- సింగరేణి సైలోబంకర్‌కు వ్యతిరేకంగా 34 రోజుల రిలే దీక్షలు

సత్తుపల్లి రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సైలోబంకర్‌కు వ్యతిరేకంగా సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామస్థులు చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలను శనివారం తాత్కాలికంగా విరమించారు. సైలోబంకర్ కారణంగా ప్రాణాలు పోతున్నా సంస్థ పట్టించుకోవడం లేదని, తమకు పునరావాసం కానీ, బంకర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ కిష్టారం గ్రామంలో అంబేద్కర్ నగర్, బీసీ కాలనీ వాసులు 34రోజుల నుంచి దీక్షలు చేపట్టిన విషయం విదితమే.

శిబిరాన్ని సందర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ద్వారా ప్రభుత్వం, సింగరేణి సంస్థతో మాట్లాడి అందరికి ఆమోద్యయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. దీంతో దీక్షలను గ్రామస్థులు విరమించారు.


నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేస్తున్న దయానంద్

లొంగిపోయే వారికి తక్షణమే ప్రతిఫలాలు

- మల్టీజోన్ ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి
- 64మంది మావోయిస్టుల లొంగుబాటు
- అందరూ ఛత్తీస్‌గఢ్ వాసులే

కొత్తగూడెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన 64 మంది సభ్యులు కొత్తగూడెంలోని జిల్లా పోలీస్ కేంద్ర కార్యాలయంలో శనివారం మల్టీజోన్ ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. ఈ మేరకు కొత్తగూడెంలో జిల్లా పోలీస్‌హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను వెల్లడించారు. లొంగిపోయే మావోయిస్టు సభ్యులకు ఆపరేషన్ చేయూత కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకుని వివిధ కేడర్లలో పనిచేస్తున్న 64 మంది మావోయిస్టు సభ్యులు లొంగిపోయినట్టు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా, బీజాపూర్ జిల్లా తదితర ప్రాంతాలకు చెందిన మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలిపారు. వివిధ కేడర్లలో పనిచేస్తున్న 64 మందిలో ఒకరు ఏరియా కమిటీ మెంబర్ (ఏసీఎం) కాగా మావోయిస్టు సభ్యులు 10 మంది, రెవల్యూషనరీ పీపుల్స్ (ఆర్పీసీ) కమిటీ 9మంది, ఆర్పీసీ మిలీషియా సభ్యులు 19 మంది, ఆర్పీసీ డకామ్స్ 11మంది, ఆర్పీసీ సీఎన్‌ఎం ఆరుగురు, ఆర్పీసీ జీఆర్‌డీ 8మంది మొత్తం 64మంది లొంగిపోయినట్టు తెలిపారు.

నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ ఆదివాసీ ప్రజల్లో ఆదరణ, నమ్మకం కోల్పోయి కాలం చెల్లిన సిద్ధాంతాలతో పాటు, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందితే తమకు మనుగడ ఉండదని భావించి, అమాయకపు ఆదివాసీ ప్రజలు నిత్యం సంచరించే ప్రదేశాల్లో మందుపాతర్లను అమర్చుతూ వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వెల్లడించారు. ఇటీవల కాలంలో ఒక ఆదివాసీ మహిళ మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి తన కాలును కోల్పోయిందన్నారు.

లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునే వారు, మావోయిస్టు పార్టీకి చెందిన వారు, వారి కుటుంబసభ్యులు కానీ, స్వయంగా కానీ తమ దగ్గరలోని పోలీస్‌స్టేషన్, జిల్లా ఉన్నతాధికారుల వద్ద సంప్రదించాలని ఐజీపీ విజ్ఞప్తి చేశారు. గత రెండన్నర నెలల కాలంలో వీరితో కలిపి మొత్తం 122 మంది మావోయిస్టు సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు తెలిపారు. లొంగిపోయిన అనంతరం వారికి చెందాల్సిన ప్రతిఫలాలను తక్షణమే అందేలా తెలంగాణ ప్రభుత్వం తరపున పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, సీఆర్‌పీఎస్ కమాండెంట్ 141 బెటాలియన్ నితేష్ ఠాకూర్, ప్రీత, 81 బెటాలియన్ సీఆర్‌పీఎస్ కమాండెంట్, రాజేష్ డోగ్రా, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సత్తుపల్లి సబ్ జైల్ సూపరింటెండెంట్‌గా కుటుంబరాజు



సత్తుపల్లిరూరల్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి సబ్ జైల్ సూపరింటెండెంట్‌గా ఉబ్బల కుటుంబరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మధిర సబ్ జైల్ నుంచి సత్తుపల్లికి సూపరింటెండెంట్‌గా బదిలీపై వచ్చారు. ఈయన ఆంధ్రాలోని కృష్ణాజిల్లాలో 2009మొదటి పోస్టింగ్‌లో చేరగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015లో చర్లపల్లి, స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (సికా), 2017లో దేవరకొండ, 2022లో వరంగల్, 2023లో మధిరలో పనిచేశారు. ఈయన స్వగ్రామం వేంసూరు మండలం దుద్దేపూడి. కాగా ఈనెల 11వ తేదీన రిమాండ్ ఖైదీ పరారై పట్టుబడిన విషయంలో ఇక్కడ ఇన్నిరోజుల పాటు పనిచేసిన సోమరాజు ప్రవీణ్, వార్డర్లు మారేశ్వరరావు, శ్రీనులు సస్పెన్షన్‌కు గురైన విషయం పాఠకులకు విధితమే.

'మామిడి కాయదశలో యాజమాన్య పద్ధతులు పాటించాలి'


మామిడితోటను పరిశీలిస్తున్న అధికారులు

తల్లాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మామిడిలో కాయ ఎదిగే దశలో అందించాల్సిన నీటి, ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి రైతులు అవగాహన కలిగి ఉండాలని ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ జి.విజయ్‌కృష్ణ సూచించారు. శనివారం తల్లాడ మండలంలోని రామానుజవరం గ్రామంలో మామిడితోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాయ ఎదిగే దశలో చీడపీడలైన నల్లతామర పురుగు, తేనెమంచు పురుగు, పండుఈగె ఉధృతి ఉంటుందన్నారు. వీటి నివారణకు తాము సూచించిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి నాగేష్, రైతులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కల్లూరులో సామూహికంగా ఖురాన్ పఠనం చేస్తున్న ముస్లిం మహిళలు

దైవ కాంతి.. దివ్య ఖురాన్

- అవతరణకు 23 సంవత్సరాల కాలం
- నెల రోజుల పాటు తరావీహ్ నమాజులో ఖురాన్ పఠనం

కల్లూరు, మార్చి15 (ఆంధ్రజ్యోతి): అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పంపిన చివరి పవిత్ర గ్రంథం దివ్యఖురాన్. ఈ రంజాన్ మాసంలోనే ఎన్నో హితవులతో, శుభవార్తలతో, మరెన్నో గాథలతో అప్పటి అవసరాలకు అనుగుణంగా దివ్యసందేశం ప్రవక్తకు చేరుతుండేది. ఇలా ఖురాన్ అవతరణ పూర్తవ్వటానికి 23 సంవత్సరాల కాలం పట్టింది. మహ్మద్ ప్రవక్తకు దివ్యవాణి అనేక రకాలుగా వినిపించేది. వాణి వచ్చే ముందు ప్రవక్తకు మొదట గంటా నాదం వినపడేది. ఆ తరువాత దైవ సందేశం ప్రవక్తకు కంఠస్థంగా వచ్చేది. దైవ దూత జిబ్రాయిల్ మానవ రూపంలో వచ్చేవారు. ఒక్కోసారి దైవదూత రూపంలోనే ఉండేవారు. ఒక్కోసారి భౌతికంగా రాకుండా ప్రవక్త హృదయంలోకి దైవ సందేశాన్ని చేర్చేవారని ప్రవక్త తన శిష్యులతో చెప్పేవారు. ఖురాన్ సందేశం మనోఫలాకానికి చేరగానే దానిని కంఠస్థం చేసుకొని ఆ అపార జ్ఞాన శక్తిని దైవం (అల్లాహ్) ప్రసాదించాడని చెప్పేవారు. దైవవాణి అవతరించి వెళ్లగానే దానిని చదవడం, రాయడం వచ్చిన తన శిష్యులతో, ప్రవక్త రాళ్లపై, చర్మాలపై, ఖర్జూర కొమ్మలపై, ఆకులపై రాయించేవారు. నేటికి 14 శతాబ్దాలకు పూర్వమే అరేబియాలోని అతి ప్రాచీన నగరం మక్కాలో ముహమ్మద్ దైవ ధ్యానంలో ఉండగా, దైవదూత ద్వారా ప్రవక్తకు ప్రత్యక్షమై అందజేసిన దైవవాణియే దివ్యఖురాన్. రమజాన్ మాసంలో అవతరణ ప్రారంభమై 23 సంవత్సారాల పాటు కొనసాగి, సంపూర్ణ దైవ గ్రంథంగా మానవాళికి అందించారు. ఇది అరబీ భాషలో ఉండగా, ప్రస్తుతం అన్ని భాషల్లోకి అనువదించారు.

రంజాన్‌లో అనుసరించాల్సిన విధానాలు

రంజాన్ మాసంలో విధిగా ప్రతి ముస్లిం ఐదు విధివిధానాలు అనుసరించాలి. అందులో ఖురాన్ పఠనం, ఖురాన్‌ను విశ్వసించి, అర్థం చేసుకొని అనుసరించటం. దీనిలో భాగంగానే ఈ రంజాన్ నెలలో ముస్లిం సమాజంలో ప్రతి ఇంట దివ్యఖురాన్ పారాయణం జరుగుతుంది. నెల రోజుల పాటు రాత్రి వేళల్లో తరావీహ నమజును ఖురాన్ పఠనంతో అనుసరిస్తారు.

ఖురాన్ పఠిస్తున్న చిన్నారులు


క్రైం సమాచారం

వడదెబ్బతో వ్యక్తి మృతి

పినపాక, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పినపాక మండలంలోని ఏడూళ్ల బయ్యారం పంచాయతీ పరిధిలో పోతురెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యురాలు తాటి రత్తాలు(55) శుక్రవారం రాత్రి వడదెబ్బతో మృతిచెందింది. ఆదివారం తన చెల్లి కూతురు పెళ్లి సందర్భంగా మూడు రోజులపాటు వివాహ ఆహ్వానపత్రికలు పంచేందుకు బంధువుల ఇళ్లకు తిరగడంతో వాంతులు, విరోచనాలు అవుతూ స్పృహ తప్పిపడిపోయినట్లు బంధువులు తెలిపారు. మణుగూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం కోసం తరలించారు. వైద్యం పొందుతూనే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

వైరా, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలడుగు-గన్నవరం రూట్లో శనివారం ద్విచక్రవాహనంపై వెళ్తున్న జి.నాగేశ్వరరావును గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. బోనకల్ మండలంలోని చిన్నబీరవల్లి గ్రామానికి చెందిన నాగేశ్వరరావు ద్విచక్రవాహనంపై నెమలివైపు వెళ్తుండగా గన్నవరం గ్రామానికి సమీపంలో ఉన్న వాగు కల్వర్టు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో ద్విచక్రవాహనం పూర్తిగా దెబ్బతిన్నది. నాగేశ్వరరావు ఒక కాలు నుజ్జునుజ్జు అయింది. చేతులు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న నాగేశ్వరరావును వైరా 108వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉంది.

కోర్టు ఉద్యోగిపై కేసు నమోదు

భద్రాచలం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగిని వేధింపులకు గురిచేసిన కేసులో భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయస్థానంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిపై రెండు రోజుల క్రితం కేసు నమోదు కాగా ఈ విషయం ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. న్యాయస్థానంలో పనిచేస్తున్న ఓ మహిళ ఉద్యోగిపై తరచూ వివిధ రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ బాధిత మహిళ ఉద్యోగి భద్రాచలం పోలీసు స్టేషన్‌లో లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బాధ్యులపై భద్రాచలం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ప్రమాదంలో డ్రైవర్ మృతి


అనిల్ కుమార్

చింతకాని, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆటోను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ గాజుల అనిల్ కుమార్ (34) ఘటన స్థలంలోనే మృతిచెందిన ఘటన మండల పరిధిలోని మండల పరిధిలోని నరసింహాపురం గ్రామ సమీపంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపాలెం మండల కేంద్రానికి చెందిన అనిల్‌కుమార్ చింతకాని మండలంలో పలు గ్రామాలకు ఆటోలో దినపత్రికలను సరఫరా చేసి ఉదయం సమయంలో నరసింహాపురం గ్రామం దాటాడు. హెచ్‌పీ గోడౌన్ ప్రాంతానికి చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొట్టడంతో డ్రైవర్ అనిల్ కుమార్ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. తెల్లవారుజామున సుమారు 5 గంటల ప్రాంతంలో ప్రమాదం జరగడంతో ఎవరూ చూడకపోవడంతో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించలేదు. శనివారం ఉదయం సమయంలో భారీ లోడ్‌తో వెళ్తున్న ఓ లారీను పోలీసులు స్థానిక కిరాణా షాపుల్లోని సీసీ ఫొటోల్లో గుర్తించి వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. మృతుడు 6వ తరగతి నుండి 8వ తరగతి వరకు చింతకాని సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యనభ్యసించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

అశ్వాపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాలపాలయ్యారు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నెల్లిపాక బంజరు గ్రామానికి చెందిన వడ్డిపర్తి శ్రీఅంజని, తుమ్మలచెరువు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ మురళీ ఖమ్మం వెళ్లేందుకు భద్రాచలం సెంటర్‌లో బస్సుకోసం వేచిఉన్నారు.

ఈసందర్భంగా కొత్తగూడెం నుంచి మణుగూరు వైపు వెళ్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తులో వేగంగా దూసుకువచ్చి వీరిని ఢీకొనటంతో అంజని కాలు విరగగా,మురళీ తలకు తీవ్రగాయమయ్యింది. స్థానికులు 108 అంబులెన్సు ద్వారా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా పరిస్థితి విషమించటంతో అంజనిని కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించారు.

ఆటోను ఢీకొన్న లారీ.. ఒకరి మృతి

ఖమ్మం రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మినరల్ వాటర్ క్యాన్‌ల లోడుతో వెళుతున్న ఆటోను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన సంఘటన ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని కరుణగిరి వద్ద శనివారం జరిగింది. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని దానవాయిగూడెం కాలనీకి చెందిన బీతపుడి నరేంద్ర(46)కరుణగిరి సమీపంలోని రాజీవ్‌గృహకల్ప వద్ద వాటర్‌ప్లాంట్ నడుపుతున్నాడు. శుక్రవారం రాత్రి ఆటోలో వాటర్ క్యాన్లు నింపుకుని ఇంటికి వస్తుండగా రాజీవ్‌గృహకల్ప నుంచి బైపాస్ రోడ్డు ఎక్కి ఖమ్మం వైపు వస్తుండగా ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళుతున్న లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేంద్రకు తీవ్ర గాయాలైయాయి. వెంటనే స్థానికులు ఖమ్మం తరలించగా మెరుగైన వైద్యంకోసం శనివారం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఖమ్మం రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తీర్థాల గ్రామంలో ఓ వ్యక్తిపై దాడి జరిగిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. తీర్థాల గ్రామానికి చెందిన బానోత్ కిరణ్ కుమార్ తన ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన మాలోతు శ్రీరామ్ అనే వ్యక్తి కిరణ్ ఇంటి ముందుకు వచ్చి బూతులు తిట్టాడు. ఇంట్లో నుంచి బయటకు వచ్చిన కిరణ్ ఎవరిని తిడుతున్నావని శ్రీరామ్‌ను ప్రశ్నించాడు. దీంతో శ్రీరామ్ పెద్ద రాయి తీసుకుని కిరణ్‌పై దాడి చేసి పారిపోయాడు. తీవ్ర గాయాలపాలైన కిరణ్ వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడికి యత్నించిన వ్యక్తి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

లక్ష్మీదేవిపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గత నెల 10వ తేదీన కూలి పని ఉందంటూ ఓ యువతిని ఆటోలో తీసుకెళ్లి లక్ష్మీదేవిపల్లి మండలం పరిధిలోని అనిశెట్టిపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో లైంగిక దాడికి ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు ఎట్టకేలకు శనివారం పట్టుకున్నారు. లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ వివరాలను వెల్లడించారు.

జూలూరుపాడు మండలం పాపకొల్లుకు చెందిన దందసలపూడి నర్సింహారావు, అలియాస్ ఉగ్గం కూలి పనిఉందని రూ.700 చెల్లిస్తామని చెప్పి ఇద్దరు యువతులను ఆటోలో ఎక్కించుకున్నాడు. ఆ ఆటో గతంలో మహబూబాబాద్‌లో దొంగలించాడు. పాల్వంచ దగ్గరలోని పెట్రోల్ బంకు వద్ద ఉన్న సమ్మక్క ఆలయం వద్ద ఒకరిని దించి, కూరగాయలు తీసుకుందామని మరో యువతిని ఇల్లెందు వైపు అనిశెట్టిపల్లి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు.

నర్సింహారావుకు తన జేబులో నుంచి కత్తి ఆమెపై లైంగికదాడికి ప్రయత్నించాడు. బాధితురాలి ముఖంపై తీవ్ర గాయం కావడంతో నిందితుడు భయపడి అక్కడి నుంచి పారిపోయాడు. ఆటోను మండల పరిధిలోని చాతకొండ గ్రామంలో వదిలేసి ఖమ్మానికి పరారయ్యాడు. జల్సా జీవితాన్ని గడుపుతూ డబ్బులు లేకపోవడంతో హన్మకొండకు వెళ్లి కోర్టు పరిసరాల్లో ఉన్న మరొక ఆటోను, ఆటోలో వ్యక్తి నుంచి సెల్‌ఫోన్‌ను దొంగిలించాడు. తన ఊరు పాపకొల్లు వస్తూ మధ్యలో వినోభానగర్ లోని ఓ ఇంట్లో మరో సెల్‌ఫోన్‌ను దొంగలించాడు. శనివారం మధ్యాహ్నం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఫారెస్ట్ కార్యాలయం ఎదుట తాను దొంగిలించిన ఆటోలో వస్తుండగా నర్సింహారావును పోలీసులు పట్టుకున్నారు. విచారించగా నేరాలను అంగీకరించాడు. అతడి వద్ద నుంచి సెల్‌ఫోన్, కత్తి, దొంగిలించిన ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు, చుంచుపల్లి ఎస్ రవి, సీసీఎస్ ఎస్ఐ రామారావు, సిబ్బంది ఉన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

అశ్వారావుపేట రూరల్/ బోనకల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలో ఇద్దరు, బోనకల్‌లో ఒక్కరు వేర్వేరు కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. అశ్వారావు మండలంలో కుటుంబ కలహాల నేపథ్యంలో శనివారం వేర్వేరు ఘటనల్లో ఇద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన తోట సన్యాసమ్మ(45)కు తన కూతురుకు కొంతకాలంగా గొడవలు అవుతున్నాయి. ఇదే తరుణంలో ఇద్దరి మధ్య శుక్రవారం రాత్రి కూడా మరోసారి వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన సన్యాసమ్మ శనివారం తెల్లవారుజామున ఇంటివద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది.

మరో ఘటనలో అశ్వారావుపేటలోని ఫైర్ కాలనీకి చెందిన ఎస్.మాణిక్యాలరావు(35)కు భార్య సుధారాణి మధ్య తరచుగా కలహాలు ఏర్పడుతున్నాయి. ఈనేపథ్యంలో మాణిక్యాలరావు శనివారం ఉదయం ఇంటివద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యయాతిరాజు వివరించారు.

బోనకల్ మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో శనివారం ఉరి వేసుకొని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం షేక్ జరీనా(28)కు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. తన అత్తతో పాటు కూలి పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. ఇద్దరు పిల్లలు మధిరలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ఒంటిపూట బడులు కావడంతో పిల్లలు ఇంటికి రాగా తలుపులు వేసి ఉండటంతో కేకలు వేసినా పలకలేదు. దీంతో బంధువులకు సమాచారం ఇవ్వగా తలుపులను తొలగించి లోపలకి వెళ్లి చూడగా ఉరి వేసుకొని మృతి చెంది ఉంది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

బైక్ ప్రమాదంలో వ్యక్తి మృతి

దమ్మపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిపోవటంతో వ్యక్తి మృతిచెందిన ఘటన గండుగులపల్లి గ్రామ సమీపంలోని శనివారం జరిగింది. ఈఘటనకు సంబంధించి దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామానికి చెందిన ఊకే రాజు, పొడియం సందీప్, పొడియం బాబు సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామం నుండి ముత్యాలంపాడు గ్రామానికి ద్విచక్రవాహనంపై వేగంగా వెళుతున్నారు. గండుగులపల్లి ముత్యాలమ్మ గుడి సమీపంలో అదుపు తప్పి ద్విచక్రవాహనం కింద పడింది. ఈఘటనలో ముగ్గురు త్రీవంగా గాయపడగా వీరిని అంబులెన్స్‌లో సత్తుపల్లి వైద్యశాలకు తరలించగా వీరిలో సందీప్ (24) మృతి చెందాడు. మృతుడి తల్లి రాధ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ఇల్లెందు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఇల్లెందు మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పర్యటనలో భాగంగా పూబెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన, జేకే కాలనీలో ఐటీఐ కళాశాల, వంద పడకల ఆసుపత్రులకు శంకుస్థాపనల అనంతరం పోలారం-భద్రుతండ, బోయితండ, రొంపేడు చెక్‌పోస్టు సెంటర్, లచ్చగూడెం బీటీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి నెమలికి బస్సు

వైరా, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వైరా నుంచి గన్నవరం మీదుగా నెమలికి ఆదివారం బస్సు సర్వీస్ ప్రారంభం కానుంది. ఆమేరకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. గన్నవరం మాజీ సర్పంచ్ శీలం సీతారావమ్మ ఆధ్వర్యంలోని మహిళలు గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ నుంచి తీసుకున్న వాగ్దానం ఇప్పటికి కార్యరూపం దాల్చనుంది. వైరా నుంచి రెబ్బవరం, కొండకొడిమ, ఖానాపురం, గన్నవరం మీదుగా నెమలికి తిరిగి అదే బస్సు నెమలి నుంచి వెళ్లిన రూట్లోనే వైరాకు నడపనున్నారు.

రోజుకు మూడు ట్రిప్పులు నడిచేవిధంగా ఆర్టీసీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థిగా రాందాస్‌నాయక్ ఇచ్చిన హామీని అమలు చేసే విధంగా గన్నవరం మాజీ సర్పంచ్ సీతారావమ్మ పదేపదే గుర్తుచేస్తూ విజ్ఞప్తి చేశారు.

చివరికి గతనెల 28న స్నానాల లక్ష్మీపురంలో మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను సీతారావమ్మ స్వయంగా కలిసి వైరా నుంచి గన్నవరం మీదుగా నెమలికి బస్సును నడపాలని, గతంలో ఇచ్చిన హామీని అమలు చేయించాలని విజ్ఞప్తి చేశారు. దాంతో ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి స్పందించిన భట్టి విక్రమార్క గన్నవరం మీదుగా నెమలికి బస్సు సర్వీస్‌ను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఆదివారం వైరా బస్టాండ్‌లో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఈ బస్సుసర్వీస్‌ను ప్రారంభిస్తారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి తెలిపారు.

లాభదాయక పంటలను సాగుచేయాలి

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- సాగర్ ఆయకట్టు పొలాల పరిశీలన


సాగర్ ఆయకట్టును పరిశీలిస్తున్న కలెక్టర్

చింతకాని, మార్చి(ఆంధ్రజ్యోతి): రైతులు లాభదాయకంగా ఉండే పంటలను సాగు చేసుకోవాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో సాగర్ ఆయకట్టు సాగును ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. సాగర్ నీటి సరఫరా, పంటల సాగు, పెట్టుబడులు, దిగుబడులు తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. సాగర్ మేజర్ కాంక్రీటు మోరీపై కూర్చిన రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నీటిపారుదల, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేడీఏ ధనసారి పుల్లయ్య, మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర, ఏవో మానస, ఆత్మ కమిటీ జిల్లా సభ్యులు కొప్పుల గోవిందరావు, నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, ఆలస్యం బసవయ్య, ముత్తినేని వెంకటేశ్వర్లు, నారపోగు కొండలరావు, రైతులు పాల్గొన్నారు.

శ్లోకమే శ్వాసగా..

భగవద్గీత కంఠస్థ పోటీల్లో ఉషారాణికి బంగారు పతకం



ఏన్కూరు, మార్చి15(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఆన్‌లైన్ భగవద్గీత కంఠస్థ పోటీల్లో ఏన్కూరు పట్టణానికి చెందిన మాదినేని ఉషారాణి బంగారుపతకం సాధించింది. ఈనెల 13న గురువారం కర్ణాటక రాష్ట్రం మైసూర్ గణపతి సచ్చిదానంద స్వామి దత్తపీఠం వారు నిర్వహించిన పోటీల్లో ఉషారాణి 18 అధ్యాయాలు, 700 శ్లోకాలను అలవోకగా కంఠస్థం చేసి అబ్బురపరిచింది. రోజుకు 14గంటలు 8 నెలలు శ్రమించి ప్రథమస్థానంలో నిలిచ బంగారు పతకానికి ఎంపికైంది. ఏప్రిల్ 2న మైసూరులో పీఠాధిపతుల చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకోనున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ భగవద్గీత కంఠస్థ పోటీల్లో బంగారు పతకం సాధించిన ఉషారాణిని మాజీ ఏఎంసీ చైర్మన్ గుత్తా వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ కోపెల శ్యామల, శివాలయం కమిటీచైర్మన్ వేముల రమేష్ బాబు, ఉపాధ్యక్షుడు కొప్పుల ప్రభావతి రెడ్డి, పేరసాని జ్యోతి, టీడీపీ నాయకులు తాళ్లూరి అప్పారావు, పొన్నం హరికృష్ణ, వారాహి బాలభగవద్గీత కంఠస్థ సభ్యులు తమ్మన్న మురళి తదితరులు పాల్గొన్నారు.


అసెంబ్లీ బడ్జెట్ సమావేశల్లో శనివారం ప్యానల్ స్పీకర్‌గా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సభను నడిపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధిపై ప్రసంగిస్తున్న సమయంలో కూనంనేని ప్యానల్ స్పీకర్‌గా వ్యవహరించారు.
- కొత్తగూడెం

20 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 20 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పాపారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 26 నుంచి మే 3 వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

అక్రమ ఇసుక నిల్వ సీజ్

పినపాక, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్డులో ఓ పెట్రోల్ బంక్ నిర్మాణం పనుల కోసం అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన 20 ఇసుక ట్రాక్టర్ల ఇసుకను తహసీల్దార్ అద్దంకి నరేష్, ఏడూళ్ల బయ్యారం ఎస్ఐ రాజ్‌కుమార్ శనివారం సీజ్ చేశారు. రెవెన్యూ పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఇసుక అక్రమ రవాణా ప్రత్యేక నిఘాతో చెక్‌పోస్టులు పెట్టారు. శనివారం ఇసుక నిల్వలను సీజ్ చేసిన అధికారులు ఓ ఎక్స్‌కవేటర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రేపు ఎస్సీ, ఎస్టీ కమిషన్ పర్యటన

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్

అశ్వారావుపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు అశ్వారావుపేట నియోజకవర్గంలోని చంద్రుగొండ, అశ్వారావుపేట మండలాల్లో ఈనెల 17,18 తేదీల్లో పర్యటించినున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ సభ్యులు సోమవారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం చేరుకొని చంద్రుగొండ మండలం, సీతాయిగూడెం ప్రాజెక్టును సందర్శిస్తారు. అనంతరం చంద్రుకుంట గ్రామంలోని గిరిజనులకు సంబంధించిన పోడు పట్టా భూములను పరిశీలించి, గిరిజన రైతులతో సమావేశమవుతారు. అదే రోజు సాయంత్రం అశ్వారావుపేట మండలం, పెదవాగు ప్రాజెక్టును సందర్శించి అనంతరం రాత్రి అశ్వారావుపేటలో బస చేస్తారు. 18వ తేదీన అశ్వారావుపేట మండలంలోని పండువారిగూడెం, గాండ్లగూడెం, కావడిగుండ్ల గ్రామాలలోని వివిధ గిరిజన సంఘాల నాయకులతో సమావేశమవుతారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలను సందర్శిస్తారు.

నిర్వాసితులకు 'హెల్పింగ్ హ్యాండ్స్'

- ఏజెన్సీ గ్రామాలకు అండగా సేవా కార్యక్రమాల నిర్వహణ


సేవా సంస్థ సమకూర్చిన వాటర్ ట్యాంకు

పినపాక, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పినపాక, మణుగూరు మండలాల్లో 'హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద' సంస్థ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మణుగూరులోని పెద్దిపల్లి లో 60 కుటుంబాలకు నిత్యావసరాలు, నూతన వస్త్రాలు పంపిణీ చేసింది. దాహార్తి సమస్య లేకుండా వాటర్ ట్యాంకు కూడా నిర్మించింది.

రూరల్ ఏరియాల్లోని సీతారామపురం, సాంబాయిగూడెం, చిక్కుడు గుంట, ఉప్పాక గ్రామాల్లో నిరుపేద చిన్నారుల కోసం అటవీ గ్రామమైన పెద్దిపల్లిలో పాఠశాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా టీచర్లను వేతనాలు ఇచ్చి నియమించారు. మణుగూరులోని బాల వెలుగు పాఠశాలలకు సదుపాయాలను కల్పించారు. విద్యార్థులకు యూనిఫాం ఇచ్చారు. తాగునీటి కోసం ట్యాంకు సమకూర్చారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఆర్థిక సాయంతో పాటు నిత్యవసరాలను అందజేస్తున్నారు.

వృద్ధాశ్రయంలో ఉంటున్న వారికి నూతన దుస్తులు, దుప్పట్లు, రగ్గులు, ఆర్థిక సాయం అందజేస్తున్నారు. వికలాంగులకు ట్రైసైకిళ్ల ఇస్తున్నారు. ఇటీవల ఓ చిన్నారి తన తల్లిదండ్రులను కొల్పోగా అక్కున చేర్చుకున్నారు. తండ్రి కర్మకాండలకు రూ.10 వేల సాయంతో పాటు చిన్నారి భవితకు అండగా నిలిచారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతిభ గల క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించే పలు క్రీడా పోటీలకు పాల్గొనేందుకు ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులుగా బీటీపీఎస్ సీఈ బి. బిచ్చన్న ఫౌండర్ చైర్మన్‌గా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండగా, ఉద్యోగులు సభ్యులుగా సహకారం అందజేస్తున్నారు. ఇతరులకు సాయం చేయడం వల్ల కలిగే సంతోషం వర్ణనాతీతమని సీఈ బిచ్చన్న తెలిపారు

ఏదులాపురం మునిసిపాలిటీకి కొత్త కమిషనర్ ?

ఖమ్మంరూరల్, మార్చి15(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం నూతన మునిసిపాలిటీ కమిషనర్ షఫీ ఉల్లాకు స్థానచలనం కలగబోతోందని చర్చ జరుగుతోంది. ఈఏడాది ఫిబ్రవరి 6న 12 గ్రామ పంచాయతీలతో ఏదులాపురం మున్సిపాలిటి ఏర్పాటు చేయటం తెలిసిందే. అయితే పరిపాలన సౌలభ్యం కోసం వెంటనే కమిషనర్‌గా షఫీ ఉల్లాను నియమించారు. రెండు నెలలు తిరగకుండానే ఆయన్ను మార్చుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఖమ్మం డీఆర్‌డీఏలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారిని కమిషనర్‌గా నియమిస్తున్నట్లు సమాచారం.

బాధిత కుటుంబాలకు మంత్రి తుమ్మల పరామర్శ


నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పలుకారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాడబోయిన రవి, ప్రముఖ న్యావవాది జాబిశెట్టి లక్ష్మీప్రియ, మాజీ సర్పంచి కుళాయి భార్య కన్నుమూశారు.ఆయా బాధిత కుటుంబాలను మంత్రి పరామర్శించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు సాధు రమేశ్‌రెడ్డి వెంటున్నారు.

18న కేయూలో విద్యార్థుల రాష్ట్ర సదస్సు

పీడీఎస్‌యూ డివిజన్ నాయకుడు

ఖమ్మంరూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): యూజీసీ నూతన ముసాయిదాను వ్యతిరేకిస్తు ఈనెల 18న కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ ఖమ్మం డివిజన్ నాయకుడు యశ్వంత్ తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని కరుణగిరి ప్రాంతంలో రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ శక్తుల కనుసన్నల్లో యుజీసీ ముసాయిదా రూపొందించిందన్నారు. ఈ సదస్సుకు విద్యార్థులు అధ్యాపకులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, వెంకటేష్, బాబు, అనిల్ పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రుడు మురళికి 'గ్లోబల్ రాక్స్ మెకానిక్స్' పురస్కారం



ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి15(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో స్థిరపడి ప్రవాసాంధ్రుడుగా ఉన్న డాక్టర్ గద్దె మురళికి అమెరికాలోని ప్రతిష్టాత్మకమైన గ్లోబల్స్ రాక్స్ మెకానిక్స్ పురస్కారం అవార్డు దక్కింది. సూర్యాపేట జిల్లాలో జన్మించిన మురళీ తల్లి,దండ్రులతో కలిసి ఖమ్మంలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విద్యాభ్యాసం చేశారు. 1968నుంచి ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ పరిశోధకులకు అవార్డును అందిస్తున్నారు. ఈక్రమంలో 2025 సంవత్సరానికి డాక్టర్ మురళిని అవార్డుకు ఎంపిక చేశారు.

రేపటి నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాల పరిశీలన

- పదిరోజుల పాటు ఖమ్మంలో పారిశుధ్య పనుల తనిఖీ
- సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లో రాష్ట్రంలో నాలుగో స్థానం
- అవార్డు దక్కితే 15వ ఆర్థిక సంఘం ప్రత్యేక నిధులు



ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి15(ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి ఖమ్మం నగరంలో స్వచ్ఛసర్వేక్షణ్ బృందాలు రానున్నాయి. పదిరోజులు పాటుగా ప్రధాన కూడళ్లు, వీధులతో పాటుగా అంతర్గత రహదారులు పరిశీలిస్తారు. పబ్లిక్ ప్రాంతాల్లో పరిశుభ్రతను తనిఖీలు చేస్తారు. రహదారుల పరిశుభ్రం,పబ్లిక్ ప్రాంతాల్లో పరిశుభ్రత, ప్రతి ఇంటినుంచి చెత్త సేకరణ విధానం, రవాణా వంటి అంశాలను క్షుణంగా పరిశీలిస్తారు. డ్రైనేజీల పరిశుభ్రతను రికార్డు చేస్తారు. చెరువులు, కుంటలు, కాల్వలను పరిశీలిస్తారు. నగరంలోని డ్రెయినేజీల మురుగు, చెత్త,ప్లాస్టిక్ వ్యర్థాలు చెరువులలోకి వెళ్లకుండా తీసుకుంటున్న చర్యలను తనిఖీలు చేస్తారు. చెరువుల నీటిసంరక్షణకు తీసుకుంటున్న విధానాలను రికార్డు చేస్తారు.

గతంలో నగరానికి అవార్డులు

ఖమ్మం నగరానికి గతంలో తెలంగాణకు హరితహారం, స్వచ్ఛసర్వేక్షణ్‌లో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 141వ ర్యాంకు సాధించింది. వీటితో పాటుగా నీటి నిర్వాహణలో జాతీయస్థాయి అవార్డును సాధించింది. అయితే ఇప్పుడు స్వచ్ఛ సర్వేక్షన్ 2025 అవార్డు పోటీలో ఖమ్మం నగరం ధీటుగా నిలిచింది. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును కైవసం చేసుకుంటే 15వ ఆర్థిక సంఘం నిధులు అందుతాయి.

12వేల మార్కులు వస్తే ఓడీఎఫ్ ప్లస్

స్వచ్ఛ సర్వేక్షణ మూడు విడతలుగా కేంద్ర ప్రత్యేక బృందాలు సర్వే నిర్వహిస్తారు. తొలి విడతలో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు, కూడళ్లు, చెరువులు, కుంటలు నిర్వహణను తనిఖీలు చేస్తారు. తొలి విడత సర్వేలో 9వేల మార్కులకు రికార్డులు నమోదు జరుగుతుంది. రెండోవిడత సర్వేలో మరుగుదొడ్ల నిర్వాహణ, చెత్త పాయింట్లు లేని నగరంగా గుర్తింపు చర్యలను పరిశీలిస్తారు. సిటీజన్ ఫీడ్ బ్యాక్ ఆన్‌లైన్ సర్వే ద్వారా 750 మార్కులను కేటాయిస్తారు. సిటీజన్ ఫీడ్‌బ్యాక్ సర్వేలో మొత్తం 50వేల పాజిటీవ్ ఫీడ్‌బ్యాక్‌లు రావాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 10,500 ఫీడ్ బ్యాక్‌లు నమోదు జరిగాయి. రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకులో ఉంది. ఈనెల చివరి వరకు 50వేల పాజిటీవ్ ఫీడ్ బ్యాక్‌లను పూర్తి చేస్తే సిటిజన్ ఫీడ్ బ్యాక్ విభాగంలో 750 మార్కులను ఖమ్మం నగరం కైవసం చేసుకొని అవార్డు రేసింగ్‌లో ఉంటుంది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సర్వం సిద్ధం

స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డుకు ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు సర్వం సిద్ధమయ్యారు. సోమవారం నుంచి తొలివిడతలో బృందాలు పరిశీలించే అంశాలను స్టడీ చేశారు. ప్రధానకూడళ్లు, రహదారులు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. నగరంలో ప్లాస్టిక్ బ్యానర్లు, హోర్డింగ్‌లు తొలగిస్తున్నారు.ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి డివిజన్ నుంచి 20 నుంచి 30 నివాసాల్లో ఢిల్లీ బృందం పరిశీలనకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 10వ డివిజన్ చైతన్య నగర్‌లో శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 10:26 నిమిషాల నుంచి 11:32 నిమిషాల వరకు అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నారు. కేరళ నుంచి విచ్చేసిన తంత్రి తక్కే కోరమంగళం దామోదరన్ నంబూద్రి, పాతికల్లం నారాయణన్ నంబూద్రి ఆధ్వర్యంలో వేడుక జరగనున్నది. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు హనుమంతరావు తెలిపారు. మహోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు హనుమంతరావు, పదవ డివిజన్ కార్పోరేటర్ చావా మాధురి నారాయణరావు, పుల్లంరాజు, 11వ డివిజన్ కార్పోరేటర్ సరిపూడి రమాసతీష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చివరి భూములకూ సాగునీరందేలా చర్యలు

నేలకొండపల్లి ఎంపీడీఓ, ఏఓ

నేలకొండపల్లి, మార్చి15(ఆంధ్రజ్యోతి):చివరి భూములకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగు నీరందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ మర్రి యర్రయ్య, వ్యవసాయాధికారి రాధ హామీ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల వ్యవసాయాధికారి, ఎంపీడీఓ, ఎన్నెస్పీ అధికారులు, సిబ్బంది శనివారం మండల పరిధిలోని సాగులో ఉన్న వ్యవసాయ భూములను పరిశీలించారు. రైతులతో కలిసి వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించారు. పంటలను పరిశీలించారు. అనంతరం ఏఓ రాధ, ఎంపీడీఓ యర్రయ్య విలేకరులతో మాట్లాడుతూ చివరి భూముల వరకు సాగునీరు అందుతున్నదీ, లేనిదీ క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకోవాలన్న ఉద్దేశ్యంతోనే వరి క్షేత్రాలను పరిశీలించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు రైతులు ఎక్కడా సాగునీటికి ఇబ్బందులు పడటం లేదన్నారు. పంటలు చేతికొచ్చేవరకు సాగునీటికి ఇబ్బంది లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేస్తూ, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే సమయంలో రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, ఏఈఓలు దుర్గాభవాని, అరవింద్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.


సుర్దేపల్లిలో వరిని పరిశీలిస్తున్న అధికారులు

వైకుంఠధామాల్లో సౌకర్యాలు కల్పించాలి

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి15 (ఆంధ్రజ్యోతి): వైకుంఠధామాల్లో వాతావరణం ప్రశాంతంగా ఉండాలని, కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. శనివారం ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు శ్మశాన వాటికను తనిఖీలు చేశారు. నీటిబోరులను పరిశీలించారు. ట్యాప్ కనెక్షన్‌లను చూశారు. స్మశాన వాటికలో ఉన్న ప్రజలతో కమిషనర్ మాట్లాడారు. సమస్యలను తెలుసుకున్నారు. అంత్యక్రియలకు హాజరయ్యే వారికి పూర్తి స్థాయిలో సౌకర్యాలుండాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, కుర్చొనేందుకు బల్లాలు, వెలుతురు, పచ్చని మొక్కలతో స్మశాన వాటికను పరిశుభ్రంగా ఉంచాలని స్మశాన వాటిక ఇన్‌చార్జీ పుల్లయ్యను కమిషనర్ ఆదేశించారు. సౌకర్యాలు ఏర్పాటుపై వెంటనే నివేదికలు ఇవ్వాలని ఇంజనీరింగ్ డీఈ శ్రీనివాస్, ఏఈ కుమారస్వామిని ఆదేశించారు. అనంతరం 35వ డివిజన్‌లో కమిషనర్ పర్యటించారు. ప్రధాన డ్రైనేజీల్లో ప్లాస్టిక్ బాటిల్స్ వ్యర్థాలను గమనించి వాటిని వెంటనే పారిశుద్య కార్మికులతో క్లీన్ చేయించారు.


వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కళావతిబాయి

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి15(ఆంధ్రజ్యోతి): నగరంలోని న్యూవిజన్ పాఠశాల వార్షిక క్రీడామహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైద్యఆరోగ్య శాఖధికారి బి కళావతిబాయి, గుండె వైద్యనిపుణులు ఎ ప్రవీణ్‌కుమార్, విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్ యండి అబాద్ అలీ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరు జీవితంలో క్రీడల కోసం కొంత సమయం కేటాయించాలని అన్నారు. విద్యార్థులు ఆటలకు దూరంగా ఉంటూ మొబైల్‌ఫోన్‌లపై ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారని ఈ అలవాటు మంచిదికాదని సూచించారు. అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, మాట్లాడుతూ ఏటా విద్యార్థులకు వారం రోజుల పాటు స్పోర్ట్స్‌మీట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

'క్రియేటివ్' ఇంగ్లిష్ డే వేడుకలు



మాట్లాడుతున్న కరస్పాండెంట్

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి15(ఆంధ్రజ్యోతి): నగరంలోని క్రియేటివ్ పాఠశాల ఇంగ్లిష్‌డే వేడుకలు శనివారం నగరంలోని వర్తక సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. ఫేమా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు, పాఠశాల కరస్పాండెంట్ కమలాకర్, డైరెక్టర్ బిజ్జాల కౌషిక్ జ్యోతిప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంగ్లిష్‌డే కార్యక్రమాన్ని విన్నూతనంగా మొట్టమొదటిసారి నిర్వహిస్తున్నామని అన్నారు.

బహుజన ఉద్యమాలకు దిక్సూచి కాన్షీరాం

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి15(ఆంధ్రజ్యోతి): దేశంలో జరుగుతున్న బహుజన ఉద్యమాలకు దిక్సూచి కాన్షీరాం అని గైనకాలజిస్టు గ్రీష్మ, వీరనారీమణుల ఆశయసాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రాబాయి తెలిపారు. శనివారం వీరనారీమణుల ఆశయసాధన సమితి ఆధ్వర్యంలో ఆసంఘం జిల్లా కార్యాలయంలో బహుజనసమాజ్‌పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతి వేడుకలను నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బహుజనసమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో కాన్షీరాం జయంతి వేడుకలను అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించారు. ముందుగా కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచారు. ఈకార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు, రాష్ట్రప్రధాన కార్యదర్శి బుర్రా ఉపేంద్రసాహు, మిరియాల నాగరాజు, కర్రి కృష్ణ పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన రాయల



నేలకొండపల్లి,మార్చి15(ఆంధ్రజ్యోతి):నేలకొండపల్లిలోని వాసవీభవన్‌లో శనివారం ఉదయం జరిగిన వివాహ వేడుకల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన వధూవరులు రోహినాద్-భవానీలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాయల నాగేశ్వరరావుతో పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పాలేరు కాంగ్రెస్ సేవాదళ్ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మధ్యగేటు వద్ద అండర్‌బ్రిడ్జి ఏర్పాటు చేయండి

ఖమ్మంబైపాస్‌రోడ్, మార్చి15(ఆంధ్రజ్యోతి): ఖమ్మంరైల్వేస్టేషన్ సమీపంలోని మధ్యగేటు వద్ద అండర్‌బ్రిడ్జి ఏర్పాటు చేయించాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను బీజేపీ రాష్ట్రనాయకుడు సన్నె ఉదయ్‌ప్రతాప్ కరీంనగర్‌లో సంజయ్ నివాసంలో శనివారం వినతిపత్రం అందించారు. త్రీటౌన్ ప్రాంతం నుంచి మధ్యగేటు మీదుగా టుటౌన్ ప్రాంతానికి నిత్యం వేలమంది ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని, ఈ మధ్య గేటు మూసివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటుచేస్తే ప్రజల కష్టాలు తీరుతాయని కోరడంతో స్పందించిన బండి సంజయ్ వెంటనే రైల్వేమంత్రికి ఫోన్ చేశారు. అండర్‌బ్రిడ్జి విషయంపై మాట్లాడినట్టు ఉదయ్ ప్రతాప్ తెలిపారు ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నకిరికంటి వీరభద్రం, సోషల్‌మీడియా ఇన్‌చార్జి శాసనాల సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో భవన రంగం పెద్దది

ఖమ్మంరూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగం తరువాత కార్మికులకు ఉపాధి కల్పించే అతిపెద్ద రంగం భవన నిర్మాణ రంగం మాత్రమే అని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గోసు పుల్లయ్య అన్నారు. మండల పరిధిలోని ఎం.వెంకటాయపాలెంలో ఈనెల 25న మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రాష్ట్ర మూడో సభలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శీలం లెనిన్, వెంకటేశ్వర్లు, నానయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

ఖమ్మంరూరల్, మార్చి15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పరీక్ష సామగ్రిని అందజేశారు.ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్తంభాద్రి సేవా సమితి అధ్యక్షుడు లక్ష్మీనరసంహరావు మాట్లాడుతూ మంచిఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి, చదివిన పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి.శ్రీనివాస్, సాయికుమార్, రామారావు, మల్లేశం పాల్గొన్నారు.

రాకాసితండా బాధితులకు జీవాల పంపిణీ

తిరుమలాయపాలెం,మార్చి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకాసితండాలో భారీవర్షాలతో నష్టపోయిన బాధితులకు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం బాధితులకు జీవాలు పంపిణీ చేశారు. 15మందికి ఒక్కొక్కరికి రూ.20వేలు విలువ చేసే జీవాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ పీవీ రామకృష్ణ వీటిని అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఐ2 రామలింగారెడ్డి, సంస్థ మేనేజర్ మెరుగు భరత్, కందుకూరి రాములు, సతీష్, ప్రశాంత్, రమేష్, సూర్యప్రకాష్, శ్రీపతి, మోహన్, నాయకులు గుగులోత్ మోహన్, రవి, బాలాజీ పాల్గొన్నారు.



పెండింగ్ వేతనాలను విడుదల చేయాలి

నేలకొండపల్లి,మార్చి15(ఆంధ్రజ్యోతి):గ్రామ పంచాయతీ సిబ్బందికి నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని శనివారం ఇఫ్టూ ఆధ్వర్యంలో మండల గ్రామ పంచాయతీ సిబ్బంది తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జాదవ్ మాణిక్యానికి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా నాయకుడు ఆవుల అశోక్, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పగిడికత్తుల రాందాసులు, మామిడి వెంకటేశ్వర్లు, చిర్రా ప్రవీణ్‌కుమార్, తోట సైదులు, జార్జి, అక్బర్, అమరావతి, ఉదయమ్మ, సాలమ్మ, విజయ పాల్గొన్నారు.

జిల్లాన్యాయసేవా సంస్థ సభ్యులుగా సీనియర్ న్యాయవాదులు

ఖమ్మంలీగల్, మార్చి15(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవా సంస్థ సభ్యులుగా సీనియర్ న్యాయవాదులు మందడపు శ్రీనివాసరావు, వీ. సంధ్యారాణి, సామాజిక కార్యకర్త డాక్టర్ పూర్ణ చంద్రరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. వీరు రెండేళ్ల ఈ పదవిలో కొనసాగుతారు. జిల్లా న్యాయసేవాధికార సమావేశాల్లో కలెక్టర్, ఎస్పీ, జిల్లా న్యాయాధికారి సమావేశాల్లో వీరు పాల్గొంటారు.



అంకితభావంతో పని చేసిన వారికి గుర్తింపు

బోనకల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పని చేసిన ఉద్యోగులకు ప్రజల మనస్సులో చిరస్థాయిగా గుర్తింపు ఉంటుందని తహసీల్దార్ పున్నం చందర్ తెలిపారు. స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో శనివారం బదిలీ కాబడిన గిర్దావర్లు గుగులోతు లక్ష్మణ్, రమాదేవిల వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎస్ఐ మధుబాబు, ఎంఈవో దామాల పుల్లయ్య, పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, కాంగ్రెస్ యువనేత బీపీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

18న బహిరంగ వేలం

ఏన్కూరు, మార్చి15(ఆంధ్రజ్యోతి): గార్లొడ్డు శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవాలయ ప్రాంగణం నందు భక్తుల తలనీలాలు పోగు చేయడానికి ఈనెల 18న మంగళవారం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఎస్వీడీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు లక్ష్మీనరిసింహాస్వామి దేవాదాయ ప్రాంగణం నందు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తికలవారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వివరాలకు ఆలయ ఈవోను సంప్రదించాలని కోరారు.

కనులపండువగా వేణుగోపాలస్వామి కల్యాణం

తల్లాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని శ్రీకృష్ణ మందిరంలో శుక్రవారం రాత్రి రుక్మిణి సమేత సంతాన వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. శ్రీకృష్ణ మందిర కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కంచల సతీష్‌శర్మతోపాటు పలువురు అర్చకులు పాల్గొని కల్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా వేణుగోపాలస్వామి, రుక్మిణి దేవిలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. కల్యాణ వేడుకలను తిలకించేందుకు పలు గ్రామాల నుంచి వందలాదిమంది భక్తులు తరలివచ్చారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

వేంసూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కందుకూరు శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు శనివారం ముగిశాయి. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి పవళింపు సేవతో ఉత్సవాలు ముగిశాయి. సోమవారం నుంచి శనివారం వరకు ఆరు రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, జాతీయస్థాయి ఒంగోలుజాతి ఎడ్లబండలాగుడు, ముగ్గుల పోటీలను మూడు రోజులపాటు నిర్వహించారు. శనివారం సీనియర్స్ విభాగంలో జరిగిన పోటీల్లో నాలుగు జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఎడ్లబండ లాగుడు పోటీలను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం విజేతలకు కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్ బహుమతులు ప్రధానం చేశారు.



మధిరరూరల్‌లో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



తల్లాడలో వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఎడ్లబండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

మధిరరూరల్‌లో...

మధిర రూరల్: మధిర మండలం మహదేవపురం గ్రామంలో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులచే కల్యాణాన్ని జరిపించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు కల్యాణపీటలపై కూర్చోన్నారు. భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు భారీగా తరలివచ్చారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఒక్క ఎకరం పంట ఎండకుండా సాగునీరందించాలి



పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న శ్రీజ

» అదనపు కలెక్టర్ శ్రీజ

ముదిగొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏఒక్క ఎకరం పంట ఎండకుండా సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులను ఆదేశించారు. శనివారం ముదిగొండ మండలం కమలాపురం గ్రామంలో ఆమె పర్యటించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పంటలకు సాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. సాగునీరు వృథా కాకుండా రైతులు వాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రైతులు, అధికారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెరువును పరిశీలించారు. చెరువు కింద ఆయకట్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెరువు నీటి మట్టం తక్కువగా ఉందని, సాగర్‌నీటితో చెరువును నింపాలని రైతులు కోరారు. సాగునీటి సమస్యలు ఏమైనా ఉంటే మండల అధికారులకు తెలియజేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, ఎంపీవో వాల్మీకి కిషోర్, నాయబ్ తహసీల్దార్ లక్ష్మీ, ఆర్ఐ ప్రసన్నకుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం చేయాలి: సీడీపీవో

సత్తుపల్లిరూరల్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామని, పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలు సెంటర్లలోనే భోజనం చేయాలని సీడీపీవో ఎన్.కనకదుర్గ సూచించారు. శనివారం ఆమె మండలంలోని బుగ్గపాడు, గాంధీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల బరువు, ఎత్తులను కొలతలు వేయించి సిలబస్ ప్రకారం బోధించడంతో పాటు ప్రీస్కూల్ నిర్వహణపై టీచర్లకు సూచనలు చేశారు.



పిల్లల బరువును పరిశీలిస్తున్న సీడీపీవో కనకదుర్గ

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

» జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య



పెనుబల్లిలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

వైరా, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నెస్పీ చివరి ఆయకట్టులోని భూములకు సాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య రైతులకు భరోసా ఇచ్చారు. మండల అధికారులతో కలిసి శనివారం వైరా మండల పరిధిలోని రాపల్లి మేజర్ కింద ఆయకట్టు ఉన్న రెబ్బవరం, తాటిపూడి, అష్టగుర్తి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆయకట్టు పరిధిలో వేసిన పంటలకు సాగర్ నీటి లభ్యత గురించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎంపీడీవో సరస్వతీ, మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజూఖాన్, ఐబీ ఏఈ హరికృష్ణ, ఏఈవోలు వెంకటనర్సయ్య, రాజేష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం పరిశీలన

పెనుబల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలంలో పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను శనివారం జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పెనుబల్లి, కారాయిగూడెం సొసైటీలతోపాటు సాయిరామ్ ట్రేడర్స్, శివమణి, వీరహనుమాన్ ట్రేడర్స్‌ల్లో ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, ఫెర్టిలైజర్, ఇన్వేటరీ వెర్ఫికేషన్ సిస్టమ్ యాప్‌ను పరిశీలించారు. ఆయన వెంట పెనుబల్లి వ్యవసాయ అధికారి ఏవీఎస్.ప్రసాదరాజు ఉన్నారు.

18న కేయూలో విద్యార్థుల రాష్ట్ర సదస్సు

ఖమ్మంరూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): యూజీసీ నూతన ముసాయిదాను వ్యతిరేకిస్తు ఈనెల 18న కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ ఖమ్మం డివిజన్ నాయకుడు యశ్వంత్ తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని కరుణగిరి ప్రాంతంలో రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ శక్తుల కనుసన్నల్లో యుజీసీ ముసాయిదా రూపొందించిందన్నారు. ఈ సదస్సుకు విద్యార్థులు అధ్యాపకులు, మేధావులు,ప్రజాస్వామికవాదులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేస్తాం

» మునిసిపల్ కమిషనర్ చింతా వేణు

వైరా, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి అగ్రహారంలో ఉన్న కబరస్తాన్‌కు వెళ్లి వచ్చేందుకు ప్రత్యామ్నాయ దారిని ఏర్పాటు చేస్తామని మునిసిపల్ కమిషనర్ చింతా వేణు హామీ ఇచ్చారు. కబరస్తాన్ దారి సమస్యపై సీపీఎం ఆధ్వర్యంలో పలు ఉద్యమాలు నిర్వహించారు. ఫలితంగా మునిసిపల్ కమిషనర్ స్పందించి శనివారం కబరస్తాన్‌ను సందర్శించి పరిశీలించారు. కబరస్తాన్‌కు వెళ్లేందుకు చేపల కాలనీ మధ్యలో ఉన్న రోడ్డును మూసివేస్తూ కాంపౌండ్‌వాల్‌కు గేట్లు వేయడంతో కొన్ని సంవత్సరాలుగా భౌతికకాయాలను తీసుకువెళ్లటానికి తీవ్ర ఇబ్బందులు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో సీపీఎం ఈ సమస్యపై ఆందోళన చేసింది. ఎట్టకేలకు కమిషనర్ కబరస్తాన్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని, గ్రామం మధ్యలోనుంచి భౌతికకాయాలను తీసుకువెళ్లకుండా నిలిపివేస్తామని హామీ ఇచ్చారు. సీపీఎం నాయకులు వేల్పుల మైఖేల్, సుంకర సుధాకర్, కొంగర సుధాకర్, అమరనేని కృష్ణ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రమేష్

సత్తుపల్లి, మార్చి15 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా 6గ్యారంటీలలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డులను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదినేని రమేష్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రావి వీర వెంకయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో శీలం సత్యనారాయణరెడ్డి, మొరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాసరావు, చలమాల విఠల్‌రావు, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తుపల్లిరూరల్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ నిమిత్తం నేడు ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శరత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వెంగళరావునగర్, ద్వారకాపూరి కాలనీ, పోస్టాఫీస్ రోడ్, లలితకుమారి ఆసుపత్రి రోడ్, జూపల్లి కంటి ఆసుపత్రి రోడ్, కల్పతరువు రోడ్, అవని వెంచర్, మహాత్మాగాంధీ రోడ్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండగా వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి

» నీటిపారుదల శాఖ డీఈఈ కిషోర్

ఏన్కూరు, మార్చి15 (ఆంధ్రజ్యోతి): నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని నీటిపారుదల శాఖ డీఈఈ కిషోర్ రైతులకు సూచించారు. శనివారం పీకే బంజర మైనర్‌కాలవను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి చివరి భూములకు నీరు సక్రమంగా అందుతుందా లేదా అని పరిశీలించారు. అనంతరం పైనంపల్లి తండా గ్రామ రైతులతో మాట్లాడారు. ప్రస్తుత పంటలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఏఈరంజిత్, ఏఈవో కె.శ్రీకాంత్, రైతులు ధరావత్ మదన్‌లాల్, లఖుపతి, భాస్కర్, రామ్మూర్తి తదితరులున్నారు.



రైతులతో మాట్లాడుతున్న డీఈఈ కిషోర్

జేఎల్‌గా విధుల్లో చేరిన వైరా యువకుడు

వైరా, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వైరాకు చెందిన గజ్జల రంజిత్ అనే యువకుడు ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్‌గా కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల హైదరాబాద్‌లో జూనియర్ లెక్చరర్ల నియామక పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేశారు. వైరా మునిసిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ కార్మికుడిగా పనిచేస్తున్న గజ్జల శ్రీనివాస్, సుజాత దంపతుల కుమారుడైన రంజిత్ గణిత శాస్త్రంలో జూనియర్ లెక్చరర్‌గా నియామక పత్రాన్ని అందుకున్నాడు. ఖమ్మంజిల్లాలోని కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టింగ్ రావడంతో ఇక్కడే బాధ్యతలు తీసుకున్నాడు.



రంజిత్

గీతాజ్ఞానమందిరంలో తదియారాధన

సత్తుపల్లిరూరల్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతాజ్ఞాన మందిరంలోని వేంచేసియున్న శ్రీ పార్ధసారథి స్వామివారి దేవాలయంలో శనివారం తదియారాధన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులు, యాచకులకు ఆహార పొట్లాలను ఉచితంగా పంపిణీ చేశారు. అదేవిధంగా స్థానిక ద్వారకాపూరి కాలనీలో ఇటీవల ప్రతిష్ఠించుకున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి నిమిత్తం పట్టణానికి చెందిన పగడాల రంగారావు, జ్యోతి, అమరేశ్వర మురళీ పవన్‌కుమార్, వాణీప్రసన్న, భాను లక్ష్మణకుమార్, బిందులు రూ.58,116విరాళంగా అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య

మధిరటౌన్, మార్చి15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెరుగైన విద్యను అందించడం జరుగుతుందని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. శనివారం మధిరలో ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద నుంచి వస్తున్న విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎటువంటి వసతులు, అధ్యాపక సిబ్బంది ఉన్నారో తెలుపుతు ముద్రించిన కరపత్రాలను అందజేస్తూ ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

సత్తుపల్లి, మార్చి15 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ నగదులో జరిగిన సైబర్ మోసాలపై తక్షణమే ఖాతా కలిగిన బ్యాంక్‌ను సంప్రదించి సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సత్తుపల్లి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ పీవీఎస్.రామలింగేశ్వరరావు అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని స్థానిక జేవీఆర్ అటానమస్ ప్రభుత్వ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారులు హక్కులు, బాధ్యతలపై సూచనలు చేశారు. ఆహారంలో కల్తీ, తప్పుడు ప్రకటనలు, మోసపూరితమైన వ్యాపార విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రపంచాన్ని శాసిస్తున్న ఈ-కామర్స్‌లో జరిగే మోసాలపై విద్యార్థులంతా అవగాహన కలిగి సమాజానికి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నండ్రు గోపీ, కన్జూమర్ క్లబ్ కన్వీనర్ డా.టీ. కృష్ణారావు, కామర్స్ హెచ్ఓడీ డా.చెన్నారావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో సాగు పద్ధతులపై అవగాహన



భూసార పరీక్ష కిట్లను అందజేస్తున్న ఏడీఏ విజయచంద్ర

మధిరటౌన్, మార్చి15(ఆంధ్రజ్యోతి): వేసవిలో సాగు పద్ధతులతో పాటు ఆత్మా కమిటీ సభ్యుల విధివిధానాలపై సభ్యులకు అవగాహన కల్పించేందుకు శనివారం మధిరలోని రైతువేదికలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మ కమిటీ చైర్మన్ రామకోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు విజయచంద్ర మాట్లాడుతూ సాగులో నెలకొన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలన్నారు. మధిర వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డా. రుక్మిణి మాట్లాడుతూ తక్కువ నీటితో పండే పంటల గురించి వివరించారు. కీటక శాస్త్రవేత్త నాగస్వాతి విత్తనశుద్ధిపై మెలకువలను తెలిపారు. వైరా కేవీకే శాస్త్రవేత్త అధిక దిగుబడులు సాధించాలంటే ఎటువంటి పద్ధతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ, వ్యవసాయ అధికారులు, ఏఈవోలు, ఆత్మ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

మధిర రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం తక్షణమే ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం మధిరలోని బోడేపూడి భవన్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మందా సైదులు, పాపినేని రాంనర్సయ్య, తేలప్రోలు రాధాకృష్ణ పాల్గొన్నారు.

'కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

చింతకాని, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే మంజూరు చేయాలని టీయూసీఐ తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం పలు హామీలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కూరపాటి అనంతరాజుకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అమర్లపూడి అప్పారావు, సూర్య ప్రకాశ్, కొండల్, రమేష్, తేజ, కమల, గోపి పాల్గొన్నారు.

పంటలకు నీరందించడంలో ప్రభుత్వం విఫలం

మధిర రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి):సాగర్ ఆయకట్టు చివరి భూముల రైతులకు నీళ్లు అందించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శనివారం మధిరలోని బోడేపూడి భవన్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మందా సైదులు, పాపినేని రాంనర్సయ్య, తేలప్రోలు రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా నామా జన్మదిన వేడుకలు

చింతకాని/ఎర్రుపాలెం/మధిరటౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను ఆయా మండల కేంద్రాలలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో మధిర మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, ఏఎంసీ మాజీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు, బీఆర్ఎస్ రూరల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి శ్రీను, కనుమూరి వెంకటేశ్వర్లు, పెంట్యాల పుల్లయ్య, బొడ్డు వెంకటరామారావు, మంకెన రమేష్, శీలం కవిత, యన్నం శ్రీనివాసరెడ్డి, సేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.

గోదావరి జలాల తరలింపునకు ఏర్పాట్లు చేయాలి

» తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

వైరా, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నెస్పీ ఎంబీసీపై తిమ్మారావుపేట వద్ద ఉన్న ఎస్కేప్ లాకులు, ఏన్కూరు సమీపంలోని రాజీవ్ లింక్ కెనాల్‌తో సాగర్‌కాల్వ అనుసంధానం ప్రాంతాలను తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆధ్వర్యంలో ఆసంఘం ప్రతినిధులు శనివారం పరిశీలించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు చుక్కకూడా రావడం లేదని, ప్రస్తుతం వస్తున్న 400క్యూసెక్కుల గోదావరి జలాలతో 15 కిలోమీటర్ల బ్యాక్ వాటర్ మళ్లింపు సాధ్యం కాదని పేర్కొన్నారు. అందువలన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుండా సత్యనారాయణరెడ్డి, దొంతెబోయిన నాగేశ్వరరావు, షేక్.జానీ, తలసాని సాయి, కాకాని కోటేశ్వరరావు, వేల్పుల రాములు, లెనిన్, రాజేష్, రాములు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన అధికారులు

కారేపల్లి, మార్చి15(ఆంధ్రజ్యోతి): వరంగల్ జోనల్ ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణిని శనివారం కారేపల్లి మండల ఎండోమెంట్ అధికారులు, సిబ్బంది కలిశారు. ఈసందర్భంగా రెండు రోజులక్రితం మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సావానికి సంబంధించిన వివరాలను ఈవో నల్లమోతు శేషయ్య, సిబ్బంది మోహన్‌లు కలిసి వివరించారు. ఈసందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని వారు కమిషనర్‌ను కోరారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు



వైరాలో దీక్షలో పాల్గొన్న బీజేపీ నాయకులు

వైరా, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యేవరకు ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్టకూడదనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ శనివారం వైరాలో నిర్వహించిన దీక్షలకు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వర్గీకరణ చేపట్టాలని అన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనుబోలు వెంకటకృష్ణ, నాయకులు ఏపూరి శ్రీనివాసరావు, చింతనిప్పు రామారావు, దోసపాటి కల్యాణ్, రంగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండలో...

ముదిగొండ: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహారదీక్షలు శనివారం ఐదోరోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో నూకల నాగేశ్వరరావు, పడిశాల నాగేశ్వరరావు, కట్టకూరు సురేష్, భద్రం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్లలో...

కొణిజర్ల: కొణిజర్ల మండల పరిషత్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన దీక్ష శనివారం ఐదో రోజుకు చేరింది. మందకృష్ణమాదిగ పిలుపు మేరకు గత ఐదు రోజులుగా దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు బానోతు సైదులు, కృష్ణలు వారికి సంఘీభావం తెలిపారు. దీక్షను ఉద్దేశించి ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు చాట్ల భాస్కర్‌రావు, ఎమ్మార్పీఎస్ అధికారప్రతినిధి కొర్లకంటి రవికుమార్ మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో గొడ్డుగర్ల శ్రీను, చాట్ల చిన్నఏసు మాదిగ, మందా రవి మాదిగ, తగరం సంజీవరావు మాదిగ, తగరం ప్రభాకర్ మాదిగ, బెల్లకొండ కృష్ణమాదిగ, సుధాకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.